

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | ఆదివారం 25 జూలై 2021 | సంపుటి : 02 | సంచిక :359 | పేజీలు : 4 | వెల : రూ 3-00


# కోవిడ్ కట్టడిలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలు భేష్

**గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రశంసలు**

**ఈ రెండేళ్లలో ఎన్నో కార్యక్రమాల్లో భాగస్వామినయ్యా**

**నూతన విద్యా విధానం అమలులో మార్గదర్శిగా నిలవాలి**



అమరావతి జూలై 24, (( విభారె) : కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సమర్థవంతంగా పని చేసిందని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఆస్పత్రుల్లో పడకలు, మందులు, ఆక్సిజన్ నిల్వలు ఇతర మౌలిక సదుపాయాలను పెంపొందించిందని చెప్పారు. రాష్ట్ర గవర్నర్‌గా రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోవిడ్ ప్రతికూల పరిస్థితుల్లో కూడా రాష్ట్ర ప్రజలు మొక్కవోని ధైర్యంతో వ్యవహరించి ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించారని ఆయన ప్రశంసించారు. వైద్యులు, ఇతర వైద్య ఆరోగ్య సిబ్బంది, పోలీసులు, పారిశుధ్య సిబ్బంది, రెడ్‌క్రాస్ ఇతర స్వచ్ఛంద సంస్థలు రాష్ట్రంలో కోవిడ్ వ్యాప్తిని అరికట్టడంలో సమర్థవంతమైన సేవలందించారన్నారు .గత రెండేళ్లలో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పర్యటించడం ద్వారా ప్రజలతో మమేకమయ్యే అవకాశం తనకు లభించిందన్నారు. సేంద్రియ వ్యవసాయం, మొక్కల పెంపకం, రక్తదాన శిబిరాలు మొదలైన ప్రజోపయోగ కార్యక్రమాల్లో తనకు పాల్గొనే అవకాశం లభించిందని చెప్పారు. ఏపీ రెడ్ క్రాస్ సొసైటీ ఒకేరోజు అత్యధిక సంఖ్యలో వలంటీర్ల ద్వారా రక్తదాన శిబిరాలను నిర్వహించడం ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నెలకొల్పడం గొప్ప ఘనతగా పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా తీసుకొచ్చిన సంస్కరణలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసి దేశానికి మార్గదర్శిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు

# మీరాబాయి చానుకు సీఎం జగన్ అభినందనలు



అమరావతిజూలై 24, (( విభారె) : టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ బోణీ కొట్టిన విషయం తెలిసిందే. భారత స్టార్ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను శనివారం వీరోచిత ప్రదర్శనతో రజత పతకాన్ని సాధించింది. 49 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంతో రజత పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా మీరాబాయి చరిత్ర సృష్టించింది. కాగా భారత్‌కు పథకం సాధించిన మీరాబాయికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ట్విటర్ స్పందించారు.'అద్భుతమైన ప్రదర్శన. టోక్యో 2020 ఒలింపిక్స్‌లో భారతదేశం పథకం సాధించడం చాలా ఆనందంగా ఉంది. 49 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో రజత పతకం సాధించినందుకు మీరాబాయి చానుకి హృదయపూర్వక అభినందనలువ అని ట్వీట్ చేశారు. కాగా కరణం మల్లీశ్వరి తర్వాత ఒలింపిక్స్ వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో పథకాన్ని గెలుచుకున్న రెండో భారతీయ మహిళగా మీరాబాయి చరిత్ర సృష్టించింది. ఒలింపిక్స్ 49 కేజీల విభాగంలో మొత్తం మీద 202 కేజీలు ఎత్తిన మీరాబాయి.. స్వర్ణం కోసం జరిగిన మూడో అటెంప్ట్‌లో మాత్రం విఫలమైంది. క్లీన్ అండ్ జెర్క్‌లో 117 కేజీలు ఎత్తే క్రమంలో తడబడింది. అయితేనేం రజతం ద్వారా భారత్ పతకాల బోణీని తెరిచిన తొలి వ్యక్తిగా నిలిచింది.

# పెగాసస్ వల్ల లక్షలాది మంది హాయిగా నిద్రపోతున్నారు : ఎన్ఎస్ఓ



న్యూఢిల్లీ : ఇజ్రాయెలీ సైబర్ సెక్యూరిటీ కంపెనీ ఎన్ఎస్ఓ గ్రూపు తన పెగాసస్ స్పైవేర్‌ను సమర్థించుకుంది. ఇటువంటి టెక్నాలజీలు నిఘా, దర్యాప్తు సంస్థలకు అందుబాటులో ఉండటం వల్ల లక్షలాది మంది రాత్రి వేళల్లో హాయిగా నిద్రపోగలుగుతున్నారని, వీథుల్లో సురక్షితంగా సంచరించగలుగుతున్నారని చెప్పింది. ఈ టెక్నాలజీని తాను ఆపరేట్ చేయనని, తన క్లయింట్లు సేకరించిన సమాచారం తనకు చేరబోదని వివరించింది. పాత్రికేయులు, మానవ హక్కుల మద్దతుదారులు, రాజకీయ నాయకులు, ఇతరులపై నిఘా పెట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగించినట్లు ఆరోపణలు రావడంతో ఇటీవల పెద్ద ఎత్తున దుమారం రేగిన సంగతి తెలిసిందే. అనేక దేశాల ప్రభుత్వాలు ఈ కంపెనీ నుంచి ఈ స్పైవేర్‌ను కొనుగోలు చేశాయని ఓ ఇంటర్నేషనల్ మీడియా కన్సార్షియం బయటపెట్టింది. ఈ నేపథ్యంలో ఎన్ఎస్ఓ అధికార ప్రతినిధి ఒకరు మీడియాతో మాట్లాడుతూ, పెగాసస్‌తోపాటు ఇటువంటి టెక్నాలజీల వల్ల ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది రాత్రి వేళల్లో హాయిగా నిద్రపోగలుగుతున్నారని, వీథుల్లో సురక్షితంగా సంచరించగలుగుతున్నారని చెప్పారు. నేరగాళ్ళ, ఉగ్రవాదులు, బాలలపై లైంగిక నేరగాళ్ళు ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ యాప్‌ల గొడుగు క్రింద దాక్కుంటున్నారని, ఇటువంటివారిని నిరోధించేందుకు, వారిపై దర్యాప్తు చేసేందుకు పెగాసస్ వంటి టెక్నాలజీలు ఇంటెలిజెన్స్ ఏజెన్సీలకు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. సైబర్ ఇంటెలిజెన్స్ టూల్స్‌ను ప్రపంచంలోని చాలా సైబర్ ఇంటెలిజెన్స్ కంపెనీలతో కలిసి ప్రభుత్వాలకు ఎన్ఎస్ఓ సమకూర్చుతోందని చెప్పారు.

# తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం: ఏఆర్కే

గుంటూరుజూలై 24, (( విభారె) : బకింగ్ హామ్ కెనాల్ రోడ్‌ను రూ. 200 కోట్లతో నాలుగు లైన్లుగా మార్చడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆమోదించారని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెలిపారు.ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తెనాలి నుంచి మంగళగిరి నేషనల్ హైవే రోడ్డు వరకు నిర్మించబోయే రోడ్డుకు త్వరలో టెండర్లు ప్రారంభమవుతాయని చెప్పారు. దుగ్గిరాల మండలంలో 18 గ్రామాల్లో రూ.70 నుంచి రూ. 80 కోట్లతో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని పేర్కొన్నారు. దుగ్గిరాల మండలాన్ని రూ. 400 కోట్లతో అభివృద్ధి చేయడానికి ఆమోదం తెలిపిన సీఎం జగన్‌కు ఎమ్మెల్యే ఆర్కే ధన్యవాదాలు తెలిపారు.



# టోక్యో లో చానుకు ఫస్ట్ మెడల్

టోక్యో, జూలై 24, (న్యూస్ పల్స్)టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ పతకాల వేట మొదలైంది. శనివారం వెయిట్ లిఫ్టింగ్‌లో మణిపూర్‌కి చెందిన మీరాబాయి చాను దేశానికి రజత పతకాన్ని అందించింది. మహిళల 49 కేజీల విభాగంలో పోటీపడిన మీరాబాయి.. స్నాచ్‌లో 87 కేజీలను లిఫ్ట్ చేసి.. క్లీన్ అండ్ జర్క్‌లో 115 కిలోలను లిఫ్ట్ చేయడం ద్వారా భారత్‌కి పతకాన్ని ఖాయం చేసింది. మొత్తంగా 202 కిలోలను మీరాబాయి లిఫ్ట్ చేయగా.. చైనా క్రీడాకారిణి జిహు ఒలింపిక్స్‌లో సరికొత్త రికార్డులు నెలకొల్పుతూ మొత్తంగా 210 కేజీలను లిఫ్ట్ చేసింది. ఇక ఇండోనేషియా లిఫ్టర్ ఆసిహ్ 194 కేజీలతో కాంస్యంతో సరిపెట్టుకుంది.



2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి తొలిసారి కాంస్య పతకాన్ని భారత్‌కి అందించగా.. 21 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మళ్లీ మీరాబాయి వెయిట్ లిఫ్టింగ్‌లో పతకం కొరతని తీర్చింది.2016 రియో ఒలింపిక్స్‌లో క్లీన్ అండ్ జర్క్‌లో 103, 106 కేజీలను లిఫ్ట్ చేసేందుకు ప్రయత్నించి మీరాబాయి ఫెయిలైంది. కానీ.. 2017లో జరిగిన వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో 48 కేజీల విభాగంలో పోటీపడిన మీరాబాయి.. గోల్డ్‌మెడల్ సాధించింది. అనంతరం 2018 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ 48కేజీల విభాగంలోనే మీరాబాయి స్వర్ణం గెలవడం విశేషం.

టోక్యో ఒలింపిక్స్‌లో మీరాబాయి కచ్చితంగా పతకం గెలుస్తుందని ఇటీవల దిగ్గజ

# 'రెడీ అనడమే తప్పు.. ఏవీ టీడీపీ రాజీనామాలు?

**చంద్రబాబు తన ఎంపీలతో రాజీనామా చేయించాలి**

**వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి**



అమరావతిజూలై 24, (( విభారె) : 'రాజీనామాలకు మేము రెడీ రెడీ అనడమే తప్పు.. టీడీపీ రాజీనామా చేసేది లేదనివ వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, చంద్రబాబు తన ఎంపీలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. "గతంలో ప్రత్యేక హోదా కోసం మా ఎంపీలు రాజీనామాలు చేశారు. టీడీపీ హయాంలో 100 మందికి పైగా సలహాదారులు ఉన్నారు. కన్సల్టెన్సీ పేరుతో మారో 200 మందిని నియమించారు. అధికారాన్ని దుర్వినియోగం చేసింది చంద్రబాబువవ అంటూ సజ్జల దుయ్యబట్టారు. పరకాల, కుటుంబరావు రాజకీయాలు తప్ప వేరే ఏమి మాట్లాడలేదని ఆయన గుర్తు చేశారు."మేము ముందు నుండి రాజకీయంగా ఉన్నాం. నేను పార్టీ ప్రధాన కార్యదర్శి గా ఉన్నా. అమరావతిలో ఎలాంటి భూ కుంభకోణం జరిగిందో ప్రజలకి తెలుసు. అమరావతి అంటేనే పెద్ద రియల్ ఎస్టేట్ కుంభకోణం. సాంకేతిక అంశాల వల్ల కోర్టు రిజెక్టు చేసి ఉండొచ్చు. అమరావతిలో ఇంకా చాలా అవకతవకలు ఉన్నాయి. ఏదొక కేసులో నిజాలు బయటకి వస్తాయి. పేరు ఇన్‌సైడ్ ట్రేడింగ్ కాకపోవచ్చు. తప్పు చేసిన వాళ్ళు తప్పించుకోలేరు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం మా ఎంపీలు పార్లమెంట్‌లో పోరాటం చేస్తున్నారు. రాష్ట్రం కోరుతున్న డిమాండ్ విషయంలో కేంద్రం సానుకూలంగా ఉంటుందని ఆశిస్తున్నామనివవ సజ్జల అన్నారు.రఘురామకృష్ణం రాజు కేసులో సీఐడీ ప్రస్తావించిన విషయం నిజం అని ప్రజలకి తెలుసునని, (స్క్రీన్‌పై రఘురామ ఉంటే, ఆఫ్ (స్క్రీన్ పై చంద్రబాబు, లోకేష్ ఉన్నారని ఆయన మండిపడ్డారు. కులాలు, మతాల మధ్య గొడవలు పెట్టడానికి కుట్ర చేశారని, ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు కూడా ఆధారాలు ఉన్నాయన్నారు. న్యాయమూర్తులపై కూడా కామెంట్లు చేశారని తెలుస్తోందని, కోర్టులు సుమోటోగా తీసుకుని విచారించాలని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

# 'ఏపీ హైకోర్టులో ధిక్కార కేసులో...

అమరావతి: ఏపీ హైకోర్టులో ధిక్కార కేసులో ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణను అదుపులోకి తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. కృష్ణా జిల్లా కలిదిండి పంచాయతీ కార్యదర్శి శ్రీమన్నారాయణకు బకాయిలు చెల్లించాలని గతంలో కోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలు అమలుచేసినప్పటికీ గత వాయిదాకు సత్యనారాయణ ఆలస్యంగా హాజరైయ్యారు. దీనితో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ రోజు వ్యక్తిగతంగా హాజరై వారెంట్ రీకాల్ కోసం పెట్టిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. రూ.50 వేలు జరిమానా జైలు శిక్ష ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. రూ.50 వేలు జరిమానాను న్యాయవాదుల సంక్షేమ నిధికి చెల్లించాలని హైకోర్టు సూచించింది. శిక్ష నిలిపివేయాలని సత్యనారాయణ, ఆయన తరపు న్యాయవాది కోరారు. రూ.10 వేల జరిమానా విధించి న్యాయవాదుల సంక్షేమ నిధికి చెల్లించాలని హైకోర్టు సూచించింది.



# అమరావతి ప్రాంతానికి 200 కోట్లు

విజయవాడ, జూలై 24, (( విభారె)రాజధాని అమరావతి ప్రాంతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుభవార్త చెప్పారు. అమరావతి ప్రాంతంలోని బకింగ్ హామ్ కెనాల్ రోడ్‌ను రూ. 200 కోట్లతో నాలుగు లైన్లుగా మార్చడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆమోదం తెలిపారని మంగళగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆర్కే శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో జరగబోయే అభివృద్ధి పనులను వివరించారు. తెనాలి నుంచి మంగళగిరి నేషనల్ హైవే రోడ్డు వరకు నిర్మించబోయే రోడ్డుకు త్వరలో టెండర్లు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు.తమ నియోజకవర్గంలో దుగ్గిరాల మండలంలో 18 గ్రామాల్లో రూ. 70 కోట్ల నుంచి రూ. 80 కోట్లతో తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని ఎమ్మెల్యే ఆర్కే పేర్కొన్నారు. దుగ్గిరాల మండలాన్ని రూ. 400 కోట్లతో అభివృద్ధి చేయడానికి ఆమోదం తెలిపిన సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అటు, మంగళగిరి నియోజకవర్గంలోనూ పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆమోదం తెలపారని చెప్పారు.రాజధాని అమరావతిని విశాఖపట్నం తరలించడానికి జగన్ సర్కారు ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అమరావతి ప్రాంతాన్ని సీఎం జగన్ నిర్లక్ష్యం చేస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమరావతి ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు సీఎం జగన్ ఆమోదం తెలపడం విశేషం.

# ఆళ్లగడ్డలో విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో నూతన సేవా సంస్థ ఆవిర్భావం

ఆళ్లగడ్డ :: జూలై 24 : (విభారె న్యూస్): కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో ప్రజలకు సేవలు అందించడానికి మరో సంస్థ ఆవిర్భవించింది. ఈరోజు ఆళ్లగడ్డ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. గతంలో లలిత కళా సమితి పేరుతో ఒక సంస్థను స్థాపించి అనేక మంది కళాకారులను ప్రోత్సహించి, నూతన కళాకారులకు అవకాశం కల్పించి లలిత కళల పట్ల తనకు ఉన్న అభిమానాన్ని చాటుకున్న విశ్రాంత న్యాయమూర్తి కాశీభట్ల శివప్రసాద్ గారు లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా బంగారు రాము యాదవ్, ఉపాధ్యక్షుడుగా డాక్టర్ గంగన్న, కోశాధికారిగా వెంకటేశ్వర్ రెడ్డి , సభ్యులుగా మాజీ జెడ్పిటిసి చాంద్బాషా, మల్లికార్జునరావు, రామాంజనేయులు, డాక్టర్ ఆంజనేయులు యాదవ్, శ్రీనివాసులు, శ్రీరాములు ఎంపికయ్యారు. ఏది ఏమైనా అనేక మంది ప్రముఖుల కలయికతో ఆవిర్భవించిన లయన్స్ క్లబ్ నుండి ఆళ్లగడ్డ పట్టణవాసులకు మరిన్ని సేవలు లభిస్తాయని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# సంపాదకీయం

ఆదివారం 25 జూలై 2021

## తాలిబన్లు దారెటు...?

ప్రపంచవ్యాప్తంగా గత రెండు దశాబ్దాల నుంచి తాలిబన్ల పేరు మార్మోగుతోంది. అసలు ఈ పేరు చెబితేనే కొన్ని దేశాలు ఉలిక్కిపడుతున్నాయి. ఉగ్రవాద దాడులతో ఈ సంస్థ అనేక దేశాల్లో దురాగతాలకు పాల్పడుతోంది. ఇరవయ్యేళ్లుగా ఏకంగా అఫ్గానిస్థాన్ లో తిష్ట వేసింది. ఈ మధ్య ఆసియా దేశంపై తన పట్టు పెంచుకుంటోంది. తాజాగా అఫ్గాన్ నుంచి అమెరికా దళాలు వైదొలగుతుండటంతో తాలిబన్లకు తిరుగులేకుండా పోతోంది. దేశంలోని మొత్తం 398 జిల్లాలకుగాను దాదాపు 198 జిల్లాలు తాలిబన్ల నియంత్రణలో ఉన్నాయి. 130 జిల్లాల్లో తాలిబన్లు, అఫ్గాన్ సైనికుల మధ్య పతాకస్థాయిలో పోరు జరుగుతోంది. మరోపక్క ఆగస్టు 31 నాటికి తమ దళాలు పూర్తిగా వైదొలగుతాయన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటన అఫ్గాన్ వాసులను మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పడే పరిస్థితి ఇలా ఉంటే ఇక అమెరికా దళాలు పూర్తిగా వెనక్క మళ్లితే పరిస్థితి మరింత దిగజారుతుందని, తాలిబన్లకు అడ్డూ అదుపు ఉండదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రెండు దశాబ్దాల పోరాటంలో అమెరికా బావుకున్నది ఏమీ లేదు. వందల కోట్ల డాలర్లు వ్యయం చేసింది. వందలమంది అమెరికా సైనికులు నేలకొరిగారు. వేలమంది క్షతగాత్రులయ్యారు. ఈ నేపథ్యంలో అసలు తాలిబన్లు ఎవరు? వారి నేపథ్యం ఏమిటి? అన్న ప్రశ్నలు ఉత్కంఠ కలిగిస్తాయి. 1990ల్లో అఫ్గాన్ నుంచి నాటి సోవియట్ యనియన్ సేనలు వైదొలగాక ఉత్తర ప్రాంతాల్లో ఆదివాసీల హక్కుల కోసం తాలిబన్లు రంగంలోకి దిగారు. క్రమంగా ఇది అతివాద సున్నీ మత సంస్థల చేతిలోకి వెళ్లి ంది. దీనికి సంపన్న దేశమైన సౌదీ అరేబియా నుంచి విరాళాలు దండిగా వచ్చేవి. తొలిరోజుల్లో తాలిబన్లు ప్రజల సంక్షేమం కోసం పరితపించేవారు. అవి నీతిని నిర్మూలించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునే వారు. మారుమూల ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం రవాణా సౌకర్యాలు కల్పించారు. తద్వారా ప్రజలకు చేరువయ్యారు. కాలక్రమంలో పరిస్థితి మారింది. ప్రజల సంక్షేమం బదులు వారిపై పెత్తనం చేయడం మొదలు పెట్టారు. ఆధిపత్య ప్రదర్శన ప్రారంభమైంది. మహిళలు బయటకు రాకూడదని, బురఖాలు ధరించాలని, బాలికలు విద్యను అభ్యసించరాదంటూ అర్థరహితమైన ఆంక్షలు విధించడం మొదలు పెట్టారు. తీవ్రాతీవ్రమైన ఆంక్షలు, శిక్షలు విధించడం ప్రారంభించారు. ఛాందసవాదం పెరిగిపోయింది. మత మౌఢ్యం జడలు విప్పింది. బహిరంగంగా ఉరిశిక్షలు అమలు చేస్తున్నారు. ఈ పరిస్థితులు అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి. మరీ ముఖ్యంగా భారత్ కు ఇబ్బంది కలిగిస్తున్నాయి. అఫ్గాన్ మనకు పొరుగు దేశం. కొన్ని వందల కిలోమీటర్ల సరిహద్దును ఆ దేశంతో పంచుకుంటోంది. అఫ్గాన్ లో సుమారు 2200 కోట్ల పెట్టుబడులు పెట్టింది. అనేక అభివద్ధి పనులు ప్రారంభించింది. ఏకంగా అఫ్గాన్ కు వందల కోట్ల రూపాయల వ్యయంతో పార్లమెంటు భవనాన్ని నిర్మించి ఇచ్చింది. దీనిని ఏపీకి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించింది. ఒక సాగునీటి ప్రాజెక్టునూ నిర్మించింది. కీలకమైన రహదారులను నిర్మించింది. ఆఫ్ఘనిస్థాన్ మరోసారి బాంబుల మోతతో దద్దరిల్లింది. ఆ దేశంలోని కందహార్ ప్రావిన్సు స్పిన్ బోల్డాక్ జిల్లాలో ఉగ్రవాదులు పౌరుల ఇళ్లపై మెరుపుదాడికి దిగారు. తాలిబాన్ ఉగ్రవాదులు ఇళ్లపై కాల్పులు జరపడంతోపాటు, ఇళ్లల్లోకి జోరబడి లూటీ చేశారు. ఉగ్రవాదుల కాల్పుల్లో 100 మంది పౌరులు ప్రాణాలను కోల్పోయారని ఆఫ్ఘాన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి మిర్వైస్ స్టానెకాయ్ తెలిపారు. మరోవైపు తాలిబాన్లు స్పిన్ బోల్డాక్ ప్రాంతాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. ముష్కరులు గృహాలు దోచుకుంటూ కాల్పులకు తెగబడ్డారని వీడియో ఫుటేజీలో స్పష్టంగా వెల్లడైంది. ఉగ్రవాదులు మోటారు బైకులపై సంచరిస్తూ మారణకాండ కొనసాగించారని స్థానిక మీడియా పేర్కొంది. ఓ ఇంటిపై తాలిబాన్ జెండాలను ఎగురవేశారు. మరోవైపు. తాలిబాన్లు ఈద్ ముందురోజు కందహార్ ప్రావిన్షియల్ కౌన్సిల్ సభ్యుడిని బయటకు తీసుకువెళ్లి కాల్చి చంపారు. స్పిన్ బోల్డాక్ ప్రాంతంలోని నేలపై పౌరుల మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు ప్రాంతాలు 90 శాతం తాలిబన్ల ఆధీనంలోకి వచ్చినట్టు వారి ప్రతినిధి రష్యా మీడియా సంస్థ ఆర్ఐఏ నొవొస్తీకి తెలిపారు. ఆఫ్ఘన్‌కు తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తుర్క్మెనిస్థాన్, ఇరాన్‌తో సరిహద్దులు ఉన్నాయి. ఆఫ్ఘన్ నుంచి అమెరికా, నాటో దళాలు వెనుతిరగడంతో తాలిబన్లు ఒక్కో ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు. పొరుగున ఉన్న పాకిస్థాన్ తాలిబన్లకు అండదండలు అందిస్తోంది. భారత్ వ్యతిరేకతను నరనరాన జీర్ణించుకున్న పాకిస్థాన్ అమెరికా దళాలు వైదొలగడాన్ని అవకాశంగా తీసుకుని రెచ్చిపోయే ప్రమాదం లేకపోలేదు. అందువల్ల భారత్ మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక చైనా తమకు మిత్రదేశమన్న తాలిబన్ల ప్రకటన మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఒక పక్క అఫ్గాన్ ప్రగతికి పాటుపడుతూనే మరో పక్క భారత్ తన భద్రతను కాచుకోవడం తప్పనిసరి.

## వామ్మో..ఒకటో తారిఖు

విజయవాడ, జూలై 24, (న్యూస్ పల్స్)అమ్మో... ఒకటో తారీఖా... వారం రోజులే ఉంది.. నిజానికి ఒకటవ తేదీ అంటే మధ్యతరగతి వర్గాలకు బెంబేలే. అలాగే బడుగు వర్గాలు కూడా ఆ డేట్ ని చూసి తెగ జడుసుకుంటాయి. నెలలో ఏ డేట్ కీ లేని ప్రాముఖ్యత దీనికి ఉంటుంది. మొత్తం నెల భారాన్ని అంతా ఈ ఒక్కరోజే మోస్తుంది. కొత్త భారాన్ని కూడా తెస్తుంది. అందుకే ఎవరైనా తలచుకుని మరీ వణికేది ఈ డేట్ ని చూసే. ఇపుడు ఇలాంటి బెంగా , కంగారూ ఏపీ ముఖ్యమంత్రి జగన్ కి కూడా పట్టుకుంది అంటున్నారు. సెటైరికల్ గా టీడీపీ నేతలు విమర్శలు చేస్తున్నా వాస్తవం చూస్తే మాత్రం అదే అంటున్నారు. జగన్ ఫస్ట్ వస్తోంది అంటే ఇబ్బందిగానే ఉంటోందిట.ఎపుడూ కటకటలాడే పరిస్థితే ఏపీది. జగన్ విషయం తీసుకుంటే ఆయన అధికారం చేపట్టి దాదాపుగా 26 నెలలు దాటింది. మొదట్లో జగన్ కి ఏపీ ఆర్థిక పరిస్థితి పెద్దగా తెలిసేది కాదు, పైగా కొత్త ఉత్సాహం, దాంతో చేతికి ఎముక లేనట్లుగా పథకల పేరిట పంచుకుంటూ పోయారు. అంతే కరోనా మహమ్మారి ఎంటరై మొత్తం సీన్ రివర్స్ చేసి పారేసింది. ఆ తరువాత సెకండ్ వేవ్ కూడా వచ్చేసింది. దాంతో అసలే చితికి ఉన్న ఏపీ మరింతగా కునారిల్లిపోయింది. ఇక సీన్ చూస్తే ప్రతీ రోజూ కటకటగానే ఉంది. అక్షయ పాత్ర తెచ్చినా కూడా ఏపీ ఖజానాను ఎవరూ నింపలేని స్థితి ఉంది అంటున్నారు.ఏపీలో ప్రతీ నెలా ఉద్యోగుల జీత భత్యాలు, పెన్షనర్ల పెన్షన్లు వంటి వాటికే భారీ మొత్తాలు తీయాల్సి ఉంటుంది. ఇలా కనుక చూసుకుంటే కచ్చితంగా పది వేల కోట్ల దాకా ఫస్ట్ కి ఖర్చుకు డబ్బు అవసరం పడుతుంది. మరి వేయి కోట్లకే అప్పుల కోసం పరిగెత్తే సీన్ ఏపీలో ఉందిపుడు. అలాంటిది ఒకేసారి పదివేల కోట్లు ఖర్చు అంటే భరించడమే కష్టం. అలా ఊహించుకోవడం కూడా చాలా కష్టం. అందుకే క్యాలండర్ లో రోజులను చూసుకుంటూ వైసీపీ అదినేత జగన్ నిద్రలేని రాత్రులే గడుపుతున్నారు అంటున్నారు.జగన్ ముందూ వెనకా చూడకుండా హామీలు ఇచ్చేశారు. సరే వాటిని నెమ్మదిగా క్రమ పద్ధతిలో నెరవేరిస్తే బాగానే ఉండేది. కానీ హడావుడిగా ఒక్కో దాన్ని అమలు చేస్తూ పోయారు. ఇపుడు వాటిని ఆపలేరు. అలాగని కొత్తగా రూపాయి పుట్టదు, ఇక సర్కార్ ఉద్యోగులకు జీతాలు ఆపుతూంటే చెడ్డపేరు వస్తోంది. ఇక పదవీవిరమణ చేసి పెన్షన్ రాళ్ళ మీద బతికేవారికి వాయిదా వేస్తే అంతకంటే అపకీర్తి ఉండదు. మొత్తానికి చూసుకుంటే ఫస్ట్ రావడంతోనే ఖర్చులు అలా తన్నుకు వస్తూంటే బడ్జెట్ పద్మనాభంలా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సతమతమవుతున్నారు. ఇక జగన్ కి సైతం ఇది తలకు మించిన భారమే అవుతుంది. తిప్పి తిప్పి చూస్తే ఇంకా ఇంటర్వెల్ కే సినిమా వచ్చింది. మొత్తం అయిదేళ్ళూ పూర్తి అయ్యేసరికి తలకు మించిన భారమా. ఏపీని ముంచే రుణ భారమా అన్నదే తేలాల్సి ఉందిఏజీ అక్షింతలు..రాష్ట్ర ప్రభుత్వం చేసే వ్యయంలో ప్రధానంగా రెండు పద్దులు ఉంటాయి. అవి రెవెన్యూ వ్యయం, పెట్టుబడి వ్యయం. చేసే ఖర్చులు ఆధారంగా ఈ పద్దులను ఖరారు చేస్తారు. ఇందులో తక్కువగా నిధులు కేటాయింపులు జరుగుతున్నప్పటికీ... పెట్టుబడి వ్యయానికే అధిక ప్రాధాన్యత ఉంటుంది. ఈ వ్యయం వల్ల సంపద సృష్టి ఉంటుందని, ఇది రాష్ట్రానికి, దేశానికి మేలు చేస్తుందని ఆర్థిక నిపుణులు చెబుతారు. అయితే ఈ ఒక్క కారణాన్ని చూపిస్తూ రెవెన్యూ వ్యయాన్ని కూడా పెట్టుబడి వ్యయంగా చూపించడం రాష్ట్ర ఆర్థికశాఖకే చెల్లింది. దీనిని అక్కౌంటెంట్ జనరల్ కూడా ఆక్షేపించడం, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడం గమనార్హంలబ్దిదారులకు ఇచ్చే ఉచిత ఇళ్లు, మరికొంత బ్యాంకు రుణాలతో ఇచ్చే గృహాలకు రాష్ట్ర ప్రభుత్వం చేసే వ్యయాన్ని కూడా పెట్టుబడి వ్యయంగా చూపించారు. సంక్షేమ రంగానికి చెందిన ఈ ఖర్చు కేవలం రెవెన్యూ వ్యయం కిందకే వస్తుంది తప్ప పెట్టుబడి వ్యయంగా లెక్కించలేమని అక్కౌంటెంట్ జనరల్ అభిప్రాయపడడం గమనార్హం. ఇదే సమయంలో పెట్టుబడి వ్యయంగా ఉండాల్సిన ఫర్నిచర్, వాహనాలువంటివి రెవెన్యూ వ్యయంలో చూపించడాన్ని కూడా ఎజి కార్యాలయం ప్రశ్నించింది. 2021-22 వార్షిక బడ్జెట్లో వైఎస్ఆర్ గృహవసతికి కేటాయించిన నిధుల్లో 1,096 కోట్లను పెట్టుబడి వ్యయంగా చూపిరచారు. ఇవి పేదలకు ప్రభుత్వం కల్పించే సంక్షేమం మాత్రమే కావడం వల్ల ఈ నిధులను పెట్టుబడి వ్యయంగా చూపించేందుకు ఆస్కారం లేదని ఇతర అధికారులు కూడా అంటున్నారు.

## పిల్లి సుభాష్ కు తగ్గిపోతున్న వాయిస్

కాకినాడ, జూలై 24, (న్యూస్ పల్స్)మాజీ మంత్రి ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ గత కొంతకాలంగా మౌనంగా ఉంటూ వస్తున్నారు. స్వర్గీయ రాజశేఖర రెడ్డి కి అత్యంత ఇష్టుడిగా అదే స్థాయిలో ఆయన తనయుడు జగన్ మోహన్ రెడ్డి అమితంగా గౌరవించే అతికొద్ది వ్యక్తుల్లో పిల్లి సుభాష్ చంద్రబోస్ ఒకరు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ అధిష్టానం అంటే తనకు వైఎస్సాఆర్ అని ప్రకటించి వైఎస్ జగన్ తో కష్టకాలంలో ప్రయాణించిన వారిలో బోస్ ముఖ్యులు. అలాగే తన రాజకీయ జీవితంలో బోస్ కి అవినీతి మరకలు లేవు. వైఎస్ ఇచ్చిన ఎలక్షన్ ఫండ్ ఎన్నికలు అయ్యాక ఇంత మిగిలిందని కొంత సొమ్మును లెక్కలతో అప్పగించిన నేత పిల్లి సుభాష్ చంద్రబోస్ ఒక్కరే అంటారు. మధ్యలో ఎవరి ప్రమేయం, అపాయింట్ మెంట్ లు లేకుండా నేరుగా ముఖ్యమంత్రి జగన్ తో చర్చించే చనువు బోస్ కె ఉందంటారు. తూర్పుగోదావరి జిల్లాల్లో నిన్న మొన్నటివరకు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాటే జగన్ దగ్గర వేదం. కానీ కొంతకాలంగా ఆ సీన్ రివర్స్ అయిందనే టాక్ వినబడుతుంది.వైఎస్ జగన్ 2019 లో రామచంద్రపురం లో దశాబ్దాలుగా అమలవుతున్న ఫార్ములా పూర్తిగా మార్చేశారు. పిల్లి సుభాష్ చంద్ర బోస్ ను అక్కడినుంచి తప్పించి మండపేట నియోజకవర్గానికి పంపించారు. అంతకుముందే 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తోట త్రిమూర్తుల చేతిలో బోస్ ఓటమి చెందినా పార్టీ నుంచి ఎమ్మెల్సీ కోటా లో అగ్రస్థానం ఇచ్చి విశ్వసనీయత కలిగి విధేయులుగా ఉండేవారి పట్ల తానిచ్చే గౌరవం చెప్పక చెప్పేశారు జగన్. పార్టీ అధికారంలోకి వచ్చాకా క్యాబినెట్ బెర్త్ తో పాటు ఉపముఖ్యమంత్రి హోదా కూడా పిల్లి సుభాష్ చంద్రబోస్ కి ఇచ్చారు జగన్. 2019 ఎన్నికల్లో రామచంద్ర పురం నుంచి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఎమ్మెల్యేగా గెలుపొందారు. బోస్ ను మంత్రి పదవికి రాజీనామా చేయించి ఆయన్ను రాజ్యసభకు పంపారు వైఎస్ జగన్. ఆయన చేసిన ఖాళీలో చెల్లుబోయిన వేణు కు మంత్రి పదవి ఇచ్చి ఆ సామాజికవర్గం పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించారు జగన్. ఆ తరువాత వేణు స్పీడ్ అందుకోగా బోస్ అన్నిటా స్లో అయ్యారు. క్యాబినెట్ లో కూడా వేణు కు అత్యంత ప్రాధాన్యత ను వైసిపి అధినేత ఇస్తూ వస్తున్నారు. ఇది కూడా బోస్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా లేకుండా చేసిందని తెలుస్తుంది.తూర్పుగోదావరి రాజకీయాలకు వచ్చేటప్పటికి ప్రధానమైన సామాజికవర్గాలు ఎస్సి, కాపు, బిసి. వీటి నడుమ సమతౌల్యం రాజకీయంగా పాటించడం ఈ జిల్లావరకు ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఈ సంప్రదాయం పాటిస్తూ వస్తుంది. వైసిపి కూడా ఈ బ్యాలెన్స్ కోసమే తోట త్రిమూర్తులకు ఇటీవల ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టింది. అనేక పార్టీలు మారిన తన చిరకాల ప్రత్యర్థిగా ఉన్న తోటను వైసిపిలోకి తీసుకురావడమే కాకుండా ఆయనకు ఎమ్మెల్సీ కూడా ఇవ్వడం పిల్లి సుభాష్ చంద్రబోస్ కి మనస్థాపం కలిగించిందనే టాక్ ఉంది. ఈ పోకడలతో ఆయన ప్రస్తుత పార్టీ రాజకీయాలపట్ల విరక్తితోనే అంటీముట్టనట్లే ఉన్నట్లు తెలుస్తుంది.గతంలో ఏ కీలకమైన నిర్ణయం తీసుకున్నా అన్నా మీ మాటేమిటి అని వైసిపి అధినేత జగన్ పిల్లి సుభాష్ చంద్రబోస్ కి గౌరవం ఇచ్చేవారని అయితే ఇటీవల ఆ మర్యాదలు తగ్గాయన్నది కొందరి మాట. ఇటీవల బోస్ అనని వ్యాఖ్యలకు అన్నట్లు టిడిపి సోషల్ మీడియా లో ప్రభుత్వం చేతులు ఎత్తేసింది అని చెప్పినట్లు చూపించిన వీడియో తరువాత వైసిపి లో అలజడి రేగింది. దీనిపై పిల్లి సుభాష్ చంద్రబోస్ వివరణ కూడా ఇవ్వాలిసి వచ్చింది. ఆయనను అలా వివరణ ఇవ్వాలని అధిష్టానం ఆదేశించిందా లేక ఆయనే పార్టీ పట్ల విధేయత ప్రకటించాలిసిన పరిస్థితి వచ్చిందా అన్న అంశంపై భిన్న కథనాలు వినవస్తున్నాయి. అప్పటినుంచి అధినేత జగన్ తో పిల్లి సుభాష్ చంద్రబోస్ నడుమ గ్యాప్ మరింత పెరిగిందని తూర్పున పొలిటికల్ సర్కిల్స్ లో టాక్. దీనితో పాటు జనరేషన్ గ్యాప్ తో పిల్లి సుభాష్ చంద్రబోస్ దూరం అయ్యి వేణు దగ్గర అయ్యి ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ గ్యాప్ మరింత పెరుగుతుందా టీ కప్పులో తుఫాన్ లా చల్లారుతుందా అన్నది కాలమే తేల్చనుంది.

## బీజేపీతో టీడీపీ అడుగులు..?




గుంటూరు, జూలై 24, (న్యూస్ పల్స్)బీజేపీతో కరచాలనం కోసం చంద్రబాబు తెగ కలవరిస్తున్నారు. కమలం దన్ను ఉంటే ఏపీలో వచ్చే ఎన్నికల్లో దున్నేయవచ్చు అన్నది చంద్రబాబు గట్టి నమ్మకం. అయితే కేంద్రంలోని మోడీ, అమిత్ షాలకు మాత్రం చంద్రబాబుతో బంధం అన్నది అసలు ఇష్టం లేదు అన్నది ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే ఆయన 2018 తరువాత డైరెక్ట్ గా ఈ ఇద్దరికే టార్గెట్ చేస్తూ వచ్చారు. ఒక దశలో కేంద్రంలోని బీజేపీని దించడానికి బాహుబలి ప్రయత్నాలే చేశారు. ఇవన్నీ కళ్ళ ముందుండగా మళ్ళీ బాబుతో దోస్తీ ఏంటి అన్నది కేంద్ర పెద్దల నిశ్చితమైన అభిప్రాయం. అయితే బీజేపీకి మాతృ సంస్థగా ఉన్న ఆర్ఎస్ఎస్ మాత్రం చంద్రబాబు పట్ల సానుకూలంగా ఉన్నట్లుగా వార్తలు వస్తున్నాయి.ఆర్ఎస్ఎస్ మాట 2014లో చెల్లుబాటు అయి మోడీతో చంద్రబాబు జట్టు కుదిరింది. 2019 నాటికి మోడీ బీజేపీ కంటే ఎక్కువగా ఎదిగిపోయారు. దాంతో పాటు ఇటు చంద్రబాబు కూడా విడాకులు ఇచ్చేశారు. కానీ 2024 నాటి పరిస్థితి అలా ఉండదు అంటున్నారు. ఇప్పటికే బీజేపీకి దేశంలో ఎదురుగాలులు వీస్తున్నాయి. దాంతో మోడీ, షాల ఆధిపత్యం మునుపటిలా సాగడంలేదు. వారు కూడా ఆర్ఎస్ఎస్ పెద్దల సలహా సూచనలను శ్రద్ధగా ఆలకిస్తున్నారు. ఈ నేపథ్యంలో పొత్తుల విషయంలోనూ, భవిషత్తు రాజకీయాల మీద ఆరెస్సెస్ మాట గతంలో మాదిరిగా చెల్లుబాటు అవుతుంది అంటున్నారు. అదే జరిగితే చంద్రబాబు నెత్తిన పాలు పోసినట్లే అన్నది హస్తిన సమాచారం.ఏపీలో జగన్ అంటే ఆర్ఎస్ఎస్ కి మంచి భావన లేదు అంటున్నారు. దానికి ప్రధాన కారణం ఆయన క్రైస్తవ మత విశ్వాసం కలిగిన వారు కారణం. ఇక జగన్ ఏపీలో మత మార్పిడులకు తెర తీస్తున్నారు అన్నది ఆర్ఎస్ఎస్ ప్రగాఢమైన అనుమానమట. ఆ మధ్య వందకు పైగా గుళ్ళ మీద దాడులు, దేవతా విగ్రహాల విధ్వంసం జరిగింది. దీన్ని ఆర్ఎస్ఎస్ తీవ్రంగానే పరిగణిస్తోంది. దేశంలో ఎపుడూ ఎక్కడా ఇంతలా దుర్ఘటనలు జరగలేదు అని ఆర్ఎస్ఎస్ పెద్దలు అంటున్నారుట. అదే విధంగా ఏపీలోని పరిణామాల పట్ల వారు తీవ్రంగా కలత చెందుతున్నారుట. ఇక ఏపీలో జగన్ సర్కార్ హిందూ మతాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తోంది అంటూ ఆర్ఎస్ఎస్ అధికార పత్రికలోనూ కథనాలు రావడం బట్టి చూస్తే జగన్ మీద ఈ అతి పెద్ద హిందూ సంస్థ అభిప్రాయం ఏంటన్నది తేటతెల్లమవుతోంది.జాతీయ రాజకీయాలో వేగంగా పరిణామాలు మారుతున్నాయి. దానికి అనుగుణంగా ఏపీలోనూ పరిణామాలు మారుతున్నాయి. మోడీతో ఢీ కొట్టేందుకు ఒక వైపు జగన్ చూస్తున్నారు. చంద్రబాబుకు కూడా అదే కావల్సింది. ఇక రెబెల్ ఎంపీ రఘురామ క్రిష్ణం రాజు అనర్హత పిటిషన్ మీద చర్యలు తీసుకోకపోవడం వెనక కూడా ఆర్ఎస్ఎస్ పెద్దల హస్తం ఉంది అంటున్నారు. ఇవన్నీ చూసిన మీదటనే జగన్ తెగదెంపుల దిశగా ఆలోచిస్తున్నారు. మరో వైపు చంద్రబాబుతో దోస్తీకి ఆర్ఎస్ఎస్ ప్రయత్నాలు కూడా సాగుతున్నాయి. ఇవన్నీ చూస్తూంటే ఒక్కటే అనిపిస్తోంది. రోగి కోరింది, వైద్యుడు ఇచ్చింది ఒక్కటే అని. అన్నీ అనుకూలిస్తే వచ్చే ఏడాదిలోగా చంద్రబాబు శుభవార్తలే వింటారు అంటున్నారు. చూడాలి మరి.

## జనసేనానికి పదవి ఖాయమేనా

తిరుపతి, జూలై 24, (న్యూస్ పల్స్)బీజేపీ తాజాగా జరిపిన కేంద్ర మంత్రి వర్గ విస్తరణ మీద ఎవరికి తోచిన భాష్యం వారు చెప్పుకుంటున్నారు. వచ్చే ఎన్నికల కోసం ఈ క్యాబినెట్ కూర్పు అన్నది అందరికీ తెలిసినా కూడా జాతీయ స్థాయిలో విపక్షం అయితే మరీ బూతద్ధంలో నుంచి చూస్తోంది. సరే జాతీయ రాజకీయాలు ఎలా ఉన్నా ఏపీ విషయానికి వస్తే ఒక్కరికీ కేంద్ర మంత్రిగా చాన్స్ ఇవ్వలేకపోయారు. ఒక విధంగా ఏపీ మీద బీజేపీ వివక్ష అలాగే కొనసాగుతోందని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున హోరెత్తిపోతోంది. కానీ బీజేపీ పెద్దలు మాత్రం ఆ ఖాళీని రిజర్వ్ లో పెట్టారని అంటున్నారు.కొత్త మంత్రులతో మాట్లాడుతూ మోడీ ఒక మాట అన్నట్లుగా వార్తల్లో వచ్చింది. ఇదే చివరిది అని అనుకోవద్దు. పనితీరు బాగా లేకపోతే ప్రక్షాళన ఉంటుందని కూడా హెచ్చరించారు. మరి ఆ హింట్ ని బట్టి చూస్తే మూడేళ్ళలో మరోసారి కొన్ని మార్పులు చేర్పులు ఉంటాయని భావిస్తున్నరు. ఇంత పెద్ద ఎత్తున 42 మంది మంత్రులతో కాకపోయినా చేర్పులూ మార్పులకూ ఎపుడూ అవకాశం ఉంటుందని కూడా అంటున్నారు. అందువల్ల ఏపీ విషయంలో బెంగ లేదని, ఆ మార్పులతో పాటే ఇక్కడా భర్తీ ఉంటుందని కూడా వినవస్తున్న మాట.ఇక ఏపీలో బీజేపీ కేంద్ర మంత్రి పదవిని ఏదో ఇచ్చామనంటే ఇచ్చామని అన్నట్లుగా ఇవ్వదుట. దానికి చాలా రాజకీయ లెక్కలు ఉన్నాయిట. అయితే వైసీపీ, లేకపోతే జనసేన ఈ రెండు పార్టీల విషయం తేలితే కచ్చితంగా ఏపీకి కేంద్ర మంత్రి ఉంటారని అంటున్నారు. ఇప్పటిదాక టైమ్ ఇచ్చి చూసినా అటు జగన్ కానీ ఇటు పవన్ కల్యాణ్ కానీ క్లారిటీ ఇవ్వలేదు. అయితే ఇపుడిపుడే పవన్ ఆలోచనా ధోరణిలో మార్పు వస్తోంది అంటున్నారు. మూడు నెలల సుదీర్ఘ విరామం తరువాత మంగళగిరి పార్టీ ఆఫీస్ కి వచ్చిన పవన్ కల్యాణ్ క్యాడర్ కి జోష్ తెప్పించకపోగా నిరాశనే పెంచారు. పార్టీ నడపడం కష్టమనే బరువైన మాటను కూడా ఆయన చెప్పారు. ఇది పవన్ వైఖరిలో వచ్చిన గుణాత్మకమైన మార్పుగా విశ్లేషిస్తున్నారు.

## నాటి విమర్శలే.. నేడు శాపాలు

విజయవాడ, జూలై 24, (న్యూస్ పల్స్)పార్లమెంట్‌లో ప్రత్యేక హోదా అంటూ వైసీపీ హడావుడి చేస్తోంది. రెండేళ్ల మొద్దు నిద్ర తరువాత ఇపుడు గుర్తుకు వచ్చిందా ? అని సాటి పక్షాలు కూడా ఎకసెక్కం చేస్తున్నాయి. మరో వైపు రాజ్యసభలో అయితే విజయసాయిరెడ్డి అతి చేస్తున్నారు అన్న చర్చ కూడా ఉంది. ఆయన ఏకంగా డిప్యూటీ చైర్మన్ మీద కాగితాలు విసిరారు అన్న దాని మీద క్షమాపణలు చెప్పారు. ఇలా వైసీపీ పొద్దు ఎరగనట్లుగా చేస్తున్న ఈ విచిత్ర విన్యాసాన్ని అటు కేంద్రం పట్టించుకోవడంలేదు. ఇటు తెలుగు రాజకీయాల్లో కూడా హైలెట్ కాలేక అభాసుపాలు అవుతున్నారు అంటున్నారు. ఇంకో వైపు చూస్తూంటే కేంద్రం కూడా లైట్ గానే వైసీపీని తీసుకుంటోన్న పరిస్థితిని మనం చూస్తూనే ఉన్నాం.ప్రత్యేక హోదా అన్నది ముగిసిన అధ్యాయమని కేంద్ర పెద్దలు ఎన్నో సార్లు చెప్పారు. ఇక వరసపెట్టి సభలో అదే సమస్య మీద ఆందోళన చేస్తూ సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తే కచ్చితంగా చర్యలకు కూడా కేంద్రం వెనకాడబోదు అంటున్నారు. మరో వైపు నాడు తెలుగుదేశం కానీ నేడు వైసీపీ కానీ కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తెచ్చుకోకుండా గాలికి వదిలేశాయనే విమర్శలు ఉన్నాయి. ఇక ఏపీలో వైసీపీకి టీడీపీకీ అసలు పడదు, ఈ రెండు పార్టీలూ ఏ రోజూ ఒకే మాట మీద లేవు. నాడు పోలవరానికి నిధులు ఎక్కువ ఖర్చు అవుతాయని సవరించిన ప్రతిపాదనలను టీడీపీ ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి పంపితే ఇదే వైసీపీ నేతలు అంత అవసరం లేదని అన్నారని తమ్ముళ్ళు అంటున్నారు.పైగా నాడు ఆ నిధుల లెక్కలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారని, నాడు కేంద్రం ఆ నిధులు ఇవ్వకుండా వైసీపీయే కుట్ర చేసిందని టీడీపీ వాళ్లు విమర్శిస్తున్నారు. ఇక ఇపుడు సవరించిన మేరకు 55 వేల కోట్ల రూపాయల నిధులను ఇవ్వాలని కేంద్రాన్ని పదే పదే కోరుతోంది. ఇపుడు టీడీపీ కిమ్మనడంలేదు. మరో వైపు రెబెల్ ఎంపీ రఘురామ రాజు అయితే పోలవరం ప్రాజెక్టులో అవినీతి చోటు చేసుకుంది అని ఫిర్యాదు చేస్తున్నారు. మరి ఆయన వెనక టీడీపీ ఉందని వైసీపీ వాళ్లు విమర్శలు చేస్తున్నారు.ఇలా ఏపీలోని రాజకీయం దారుణంగా తయారై ఒకరి మీద ఒకరు చాడీలు చెప్పుకుంటూ పోతే కేంద్రం ఎలా ? గౌరవిస్తుంది, ఎలా నిధులు ఇస్తుంది అన్న ప్రశ్న కూడా ఉంది. వీళ్లు వీళు తన్నుకుంటుంటే కేంద్రం చోద్యం చూస్తూ తమకు ఎప్పుడు లాభం కలుగుతుందా ? అని ఎంజాయ్ చేస్తోన్న పరిస్థితే ఉంది. మరో వైపు చూస్తే మోడీ సర్కార్ మీద వైసీపీ పోరాటం వెనక చిత్తశుద్ధి కనుక ఉంటే టీడీపీని కూడా కలుపుకుని పోవాలి కదా అన్న మాట ఉంది. ఎవరికి వారు పార్లమెంట్ లో తామే ఆందోళన చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారు కానీ అక్కడ కేంద్ర పెద్దలు ఏపీని అసలు పట్టించుకోవడమే లేదని అంటున్నారు.

## పథకాల కంటే.. ప్రచారాలకే ఎక్కువా

నెల్లూరు, జూలై 24, (న్యూస్ పల్స్)చంద్రబాబు పాలనకు ఇప్పుడు జగన్ పరిపాలనకు మధ్య ఒక విషయంలో తేడా కనిపించడం లేదని అంటున్నారు పరిశీలకులు. అప్పట్లో చంద్రబాబు నడిచిన మార్గంలోనే ఇప్పుడు జగన్ కూడా నడుస్తున్నారని చెబుతున్నారు. విషయం ఏంటంటే.. గతంలో చంద్రబాబు మీడియాను నమ్ముకున్నారు. ప్రచారానికి ఎక్కువ ప్రిఫరెన్స్ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు సమీక్షను ఏకంగా.. ప్రచార ఆర్భాటంగా మార్చేశారు. ఏటా జనవరిలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సును కూడా ప్రచారానికి బాగా వాడుకున్నారు. అదే సమయంలో ఇతర పథకాలను కూడా ప్రచారానికి ఎక్కువగా వాడుకున్నారు.దీంతో ప్రచారం అయితే లభించింది కానీ.. పోలవరం కానీ, అమరావతి కానీ, పెట్టుబడుల సదస్సులు కానీ.. ఏపీకి ఎలాంటి లాభాలనూ పెద్దగా తీసుకురాలేక పోయాయి. దీంతో ప్రచారం ఎక్కువ పనితక్కువ అనే ప్రధాన విమర్శలు.. చంద్రబాబు సర్కారుకు బాగానే తాకాయి. ఇప్పుడు అచ్చం అదేవిధంగా జగన్ పాలనలోనూ .. జరుగుతోందని అంటున్నారు పరిశీలకులు. చాలా వరకు మీడియాకు దూరంగా ఉంటున్నానని చెబుతున్న జగన్.. ప్రతి పథకాన్నీ ప్రచారాలతో నింపేస్తున్నారు. చేయూత కింద 45 ఏళ్లు దాటిన మహిళలకు లబ్ధి చేకురుస్తామంటూ.. పథకానికి సమానంగా ఆయన ప్రచారానికి ఖర్చు చేశారు.ప్రధాన పత్రికల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి యాడ్స్ ఇచ్చారు. రైతు భరోసా గత ఏడాది ప్రారంబించారు. అయినా.. ఇటీవల దీనికి నిధులు ఇచ్చే సమయంలో మళ్లీ ఇప్పుడే ప్రారంభిస్తున్నామనే విధంగా ప్రచారం కల్పించుకున్నారు. ఇక, అన్నిటికన్నా వింత ఏంటంటే.. జాబ్ క్యాలెండర్. నిజానికి దీనివల్ల వచ్చే లబ్ధి ఇప్పట్లో కనిపించదు. కానీ, జాబ్ క్యాలెండర్ విడుదల సందర్భంగా కూడా జగన్.. భారీ ఎత్తున ప్రకటనలు గుప్పించారు. ఇక, ఇప్పుడు.. తాజాగా మహిళలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో తీసుకువచ్చిన దిశ యాప్ వ్యవహారంలోనూ ఇదే విధంగా జగన్ వ్యవహరిసంచారు.పెద్ద ఎత్తున దీనికి యాడ్‌లు ఇవ్వడం ద్వారా.. భారీగానే ఖర్చు చేశారు. నిజానికి యాప్ తయారీకి.. అయిన ఖర్చుకు వంద రెట్లు యాడ్ కోసం ఖర్చు చేసినట్టు అధికారులే చెబుతున్నారు. మరి దీనివల్ల ఎంత మందికి ప్రయోజనం జరుగుతుందనే విషయం పక్కన పెడితే.. ప్రస్తుతానికి కోట్ల రూపాయల చమురు మాత్రం వదిలింది. ఇదంతా చూస్తే.. నాడు బాబు.. నేడు జగన్.. ప్రచారానికే పరిమితమయ్యారని అంటున్నారు.

# ఎంపీ మాగుంట కుమారుడి కోసం ప్రయత్నాలు

ఒంగోలు, జూలై 24, (న్యూస్ పల్స్)వచ్చే ఎన్నికల నాటికి వారసుడిని బరిలో దించాలన్నది ఆ ఎంపీ ఆలోచన. ఇందుకోసం ప్లేస్ కూడా ఫిక్స్ చేసుకున్నారట. విషయం తెలుసుకున్న అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే బుసలు కొడుతున్నారట. ఇది కాస్తా గుప్పుమనడంతో రెండువర్గాల మధ్య వార్ ఓ రేంజ్‌లోకి చేరుకుంది. ఆ రగడేంటో ఈ స్టోరీలో చూద్దాం.రాజకీయాల్లో తండ్రి కీలక స్థానంలో ఉంటే.. తనయులు ఆయన్ని అనుసరించడం కామన్. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునేలా పాలిటిక్స్‌లో వారసులకు ఓనమాలు దిద్దిస్తారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కూడా ప్రస్తుతం ఇదే పనిలో ఉన్నారట. తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డిని ప్రత్యక్ష రాజకీయాల ద్వారా తెరమీదకు తెచ్చేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారట. ఎంపీగా తాను ప్రాతినిథ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గంలో కాకుండా.. కుమారుడి కోసం ఇంకో స్థానాన్ని ఎంపిక చేసుకోవడంతో ప్రకాశం జిల్లా వైసీపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.అన్న మాగుంట సుబ్బరామిరెడ్డి వారసత్వంగా మాగుంట శ్రీనివాసులురెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి మూడుసార్లు కాంగ్రెస్.. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి ఎంపీగా గెలుపొందారు. జనంలో క్రేజ్ ఉన్నప్పుడే వారసుడు రాఘవరెడ్డిని ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని గిద్దలూరు అసెంబ్లీలో తరచుగా చక్కర్లు కొట్టిస్తున్నారట. 2019 ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గంలో మాగుంటకి భారీ మెజారిటీ రావడం.. తన సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువగా ఉండటంతో ఆయన గిద్దలూరుపై కన్నేశారని వైసీపీలో టాక్. దీంతో మాగుంట తనయుడు రాఘవరెడ్డి ఏదో ఒక కార్యక్రమం పేరుతో గిద్దలూరులో తరచుగా పర్యటిస్తున్నారట.గిద్దలూరులో వైసీపీ నుంచి అన్నా రాంబాబు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇలా సొంత పార్టీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నచోట.. రాంబాబుకు చెప్పకుండానే రాఘవరెడ్డి పర్యటనలు సాగుతున్నట్టు సమాచారం. అంతేకాదు.. కుమారుడి కోసం నియోజకవర్గంలో సొంతంగా ఒక వర్గాన్ని మాగుంట సిద్ధం చేశారట. ఈ విషయం తెలిసినప్పటి నుంచి తాచుపాములా బుస కొడుతున్నారట ఎమ్మెల్యే అన్నా రాంబాబు. ఎంపీ తనయుడు పర్యటనలకు వెళ్లొద్దని.. అనుచరులకు, అధికారులకు మౌఖికంగా ఆదేశాలిచ్చారట ఎమ్మెల్యే. వైసీపీ ముఖ్య నేతలకు కూడా గిద్దలూరులో ఎంపీ మాగుంట చేస్తున్న పాలిటిక్స్‌పై రాంబాబు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది.గిద్దలూరులో ప్రస్తుతం వైసీపీ రాజకీయాలు ఎంపీ మాగుంట వర్సెస్ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నట్టుగా మారాయి. రెండు వర్గాలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయట. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉంది. ఈలోగా ఈ ఆధిపత్య పోరు ఏ స్థాయికి వెళ్తుందో.. ఎటు దారితీస్తుందో తెలియక కేడర్ ఆందోళన చెందుతుందట. రెండు వర్గాల మధ్య రాజకీయం ఉప్పు నిప్పులా ఉంది. ఇద్దరూ బలమైన నాయకులే కావడంతో వారి వర్గాలు సైతం వెనక్కి తగ్గేలా లేవు. మరి రానున్న రోజుల్లో ఏం జరుగుతుందో.. ఎవరు పైచెయ్యి సాధిస్తారో చూడాలి.

# ఖాదీ బోర్డ్ భూముల అవినీతి పై యువత ముందుకు రావాలి

కోరుట్ల జూలై 24 పూదూర, కిసాన్ నగర్ లో గల మెట్ పల్లి ఖాది బందార్ కి సంబంధించిన భూములను తక్కువ ధరలకు కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అనుయాయులకు, తెరాస పార్టీ నాయకులకు అతి తక్కువ ధరలకు అమ్మి కోట్ల రూపాయలను కొల్లగొట్టిన ఖాదీ బోర్డ్ చైర్మన్ కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు చేస్తున్న అవినీతి లీలాలపై రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ మరియు రాష్ట్ర మంత్రి కేటీఆర్ తక్షణమే స్పందించి, ఈ అవినీతి భాగోతం పై సీబీఐ చే విచారణ జరిపించి తక్షణమే ఖాదీ బోర్డ్ చైర్మన్ పదవి నుంచి తక్షణమే తప్పించి విచారణ కొనసాగించాలని కాంగ్రెస్ సీనియర్ నేత జువ్వాడి కృష్ణా రావు గారు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణా రావు మాట్లాడుతూఅదే విధంగా ఇట్టి అక్రమాలపై న్యాయ పోరాటం చేసి ఖాదీ బోర్డ్ కే తిరిగి భూములు దక్కేలా నా వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.. ఇట్టి అవినీతిపై పోరాడడానికి పద్మశాలి యువతతో పాటు యువజన సంఘాలు ముందుకు వచ్చి పోరాడాలని పిలుపు ఆయన ఇచ్చారు.. మెట్ పల్లి ఖాదీ బోర్డ్ చైర్మన్ గా పివి నరసింహారావు, చొక్కా రావు , రాజేశ్వర్ రావు లాంటి గొప్ప నేతలు చైర్మన్ గా ఉన్నప్పుడు బోర్డ్ భూములను అమ్మే ఆలోచన కూడా చేయలేదని , 60 సంవత్సరాల నుంచి రాని నష్టాలు ఈ రోజు ఎక్కడివి అని ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడితే ప్రతి పక్ష పార్టీగా ఎప్పటి కప్పుడు ప్రజల పక్షాన నిలబడి ఈ దుర్మార్గపు చర్యలను ఎండ గడుతునే ఉంటానని కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొంతం రాజం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, మాజీ కౌన్సిలర్ సొగ్రబి, పట్టణ ఉపాధ్యక్షుడు ఎం నయీం, పట్టణ మాజీ అధ్యక్షుడు అక్బర్, మెట్ పల్లి పట్టణ అధ్యక్షుడు కుతుబుద్దిన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అద్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి, మ్యకల నర్సయ్య, జెట్టి లక్ష్మణ్,గంగ నర్సయ్య, మ్యాదరి లక్ష్మణ్,రంజిత్ గుప్తా, సరికేళ్ళ నరేష్, ముహమ్మద్ నసీర్ తదితరులు పాల్గొన్నారు ...

### సజ్జల ను కలిసిన స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్

నెల్లూరు సజ్జల రామకృష్ణారెడ్డి ని స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగాఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ, దంపతులు పొణకా శివకుమార్ రెడ్డి,పొణకా దివ్య తేజ,సజ్జలను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు రు మాట్లాడుతూ వైకాపా పార్టీ బలోపేతానికి, రాష్ట్రం స్వచ్ఛత ర్యాంకులో ముందు ఉండేలా కృషిచేస్తామని తెలియ చేశారు. ప్రతి ఒక్కరూ పచ్చదనం పరిశుభ్రత స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

# షర్మిలకు క్రేజ్ తగ్గుతోందా



హైదరాబాద్, జూలై 24, (న్యూస్ పల్స్)తెలంగాణలో రాజన్న రాజ్య స్థాపనే లక్ష్యంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీని లాంఛనంగా ప్రకటించారు ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల. సంక్షేమం, స్వయం సమృద్ధి, సమానత్వమే ఎజెండాగా ఆమె ముందుకు సాగుతున్నారు. అంతేకాకుండా నిరుద్యోగ సమస్యపై ప్రతి మంగళవారం నిరుద్యోగ నిరాహార దీక్ష చేపట్టేందుకు ఆమె పూనుకున్నారు. వచ్చే వారంలో పోడు సమస్యలపై కూడా పోరాటం చేసేలా ఆమె ప్లాన్ చేసుకున్నారు. అయినా ప్రజల మన్ననలు మాత్రం ఆమె పొందలేకపోతున్నారు. నిరుద్యోగ యువత కోసం నిరాహారదీక్ష చేపడుతున్నా పట్టుమని 50 మంది రావడంలేదు. దీంతో రాజకీయవర్గాల్లో షర్మిలకు క్రేజ్ తగ్గిందనే టాక్ వినిపిస్తోంది.ఇక జిల్లాల పర్యటనల్లోనూ పార్టీ నాయకులు తప్పా ఎక్కడా పెద్దగా ఆదరణ కరువైనట్లు తెలుస్తోంది. జన సమీకరణలో నేతలు ఫెయిల్ అవడంపై షర్మిల మండిపడినట్లు తెలుస్తోంది. ఇటీవల పార్టీ ఆవిర్భావం నాడు కూడా షర్మిల ఈ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పార్టీ పెడతానని ప్రకటించిన నాటి నుంచి షర్మిల అన్ని జిల్లాలకు చెందిన వైఎస్సార్ అభిమానులు, నాయకులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఆ సమయంలో తెగ హడావుడి చేసిన నేతలు సైతం క్రమంగా లోటస్ పాండ్ కు రావడం తగ్గించేశారు. అయితే ఇందుకు మూస పద్ధతిలో కొనసాగుతున్న షర్మిల ప్రసంగాలే కారణంగా చెబుతున్నారు కొందరు నేతలు. గతంలో పలుమార్లు తెలంగాణ యాసను అనుకరించేందుకు షర్మిల ప్రయత్నించినా పెద్దగా వర్కవుట్ అయినట్లుగా కనిపించడంలేదు.తెలంగాణ ప్రజలను ఆకట్టుకోవాలంటే ఈ విధానం సరిపోదని పలువురు నేతలు భావిస్తున్నారు. దీనికి తోడు ఆమె ప్రతీ మీటింగ్‌లో చెప్పే అంశాలనే తిరిగి మరో మీటింగ్‌లోనూ చెప్పడం వల్ల కూడా కొంత మైనస్ అవుతున్నట్లు వారు చెబుతున్నారు. దీనివల్ల పార్టీలో చేరేవారి సంగతి పక్కన పెడితే దూరమయ్యే వారే అధికమవుతారనే ప్రచారం జరుగుతోంది. పార్టీ ఆవిర్భావం సమయంలోనూ ఇతర పార్టీలకు చెందిన పలువురు కీలక నేతలు చేరుతారని చెప్పి చివరకు ఉసూరుమనిపించారు.వైఎస్సార్ టీపీ అధినేత్రి షర్మిలను నాయకులు, వైఎస్సార్ అభిమానులు ‘షర్మిలమ్మ’ అని పిలవాలని ఆమెకు అత్యంత సన్నిహితంగా ఉండే నేతలు ఆదేశించినట్లుగా తెలుస్తోంది. అలా పిలవడం హుందాతనానికి నిదర్శనంగా లోటస్ పాండ్ వర్గీయులు భావిస్తున్నట్లు సమాచారం. ఇది ఇక్కడి ప్రజలకు ఏమాత్రం సెట్ అవ్వదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. షర్మిల ఎంచుకునే సబ్జెక్ట్ కూడా పెద్దగా జనాలకు చేరువకావడం లేదని తెలుస్తోంది. అందుకే నిరుద్యోగ యువత కోసం ప్రతి మంగళవారం నిరాహార దీక్షకు పూనుకున్నా.. పెద్దగా ఆసక్తి కనబరచడంలేదని సమాచారం. ఏపీ ముఖ్యమంత్రి జగన్ వైఖరి కూడా ఇలాగే ఉండేదని, సీఎంగా లేని సమయంలోనూ ఎంత ఆత్మీయులైనా సరే.. సర్ అని పిలవాల్సిందేనని ఆదేశించేవారని విశ్లేషకులు చెబుతున్నారు.వైఎస్సార్ టీపీ అధినేత్రి షర్మిల చేపడుతున్న జిల్లాల పర్యటనల్లో జనం పెద్దగా ఆదరించడంలేదనట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి ఆమెతో వెళ్లే నాయకులు మినహా కనీసం 50 మంది కూడా రావడంలేదు. నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వంతో పోరాడుతున్నా ఇంత తక్కువ జనం రావడం ఆమెకు ఆందోళన కలిగించే అంశంగా మారింది. నిరుద్యోగ సమస్య కాబట్టి కనీసం యువకులు కూడా రాకపోవడం గమనార్హం. జనసమీకరణలో నేతలు సైతం ఫెయిలైనట్లుగా తెలుస్తోంది. దీనికి తోడు పార్టీలో సరైన గుర్తింపు లేక కూడా నేతలు చురుకుగా పనిచేయకపోవడానికి కారణంగా తెలుస్తోంది.పార్టీ ఏర్పాటు సమయంలో వైఎస్సార్ టీపీలో చేరికలపై తొలుత భారీ ఎత్తున ప్రచారాలు జరిగాయి. వైఎస్సార్ అభిమానులు, నాయకులు, రెడ్డి వర్గీయులు, దళిత వర్గానికి చెందిన నాయకులంతా వైఎస్సార్ టీపీకి క్యూ కడుతారనే ఊహాగానాలు వెల్లువెత్తాయి. పార్టీ ఆవిర్భావం రోజున కూడా ఎంతో మంది నేతల చేరికలుంటాయని లోటస్ పాండ్ వర్గీయులు ప్రచారం చేశారు. ఆ రోజు చేరే వారికి ఆవిర్భావ వేడుకల్లోనే కండువాలు కప్పాలని తొలుత నిర్ణయించారు.అయితే షర్మిల బేగంపేట నుంచి ర్యాలీగా జేఆర్ సీ కన్వెన్షన్ కు వచ్చిన సమయంలోనూ, హాల్ లోనూ తక్కువ జనం రావడంపై నేతలపై మండిపడినట్లు తెలుస్తోంది. అందుకే ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికి కూడా ఆ పార్టీలో గతంలో చేరిన నేతలు తప్పా కొత్తగా చేరికలు మాత్రం జరగడంలేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే షర్మిల రాజకీయ భవిష్యత్ అంధకారంలోకి వెళ్లే ప్రమాదముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# తాగునీటి పథకం పంపు హౌజ్ ను ప్రారంభించని ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రిజూలై 24, (న్యూస్ పల్స్) తాడిపత్రి నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా చేస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండల పరిధిలోని కోటకొండ గ్రామం వద్ద ఉన్న జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకం సంబంధించిన పంప్ హౌస్ ను ఆయన ప్రారంభించారు. ముందుగా కోటకొండ గ్రామం చేరుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోటకొండ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని అక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన పంప్ హౌస్ వద్దకు చేరుకుని పంప్ హౌస్ నందు గల మోటార్ స్విచ్ లను ఆన్ చేసి మోటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల స్వార్థ రాజకీయాల వలన నియోజకవర్గంలో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి అన్నారు. అది చేస్తాం.... ఇది చేస్తామని మాయమాటలు చెప్పి స్వయంగా వారి తండ్రి పేరు మీద ఒక పథకాన్ని తీసుకు వచ్చి అందులోనూ కమిషన్ దండుకుని మొత్తం సర్వనాశనం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రి పేరు పెట్టి ఆయన పేరును శాశ్వతంగా నిలబెట్టాల్సిన కొడుకులు కమీషన్లకు కక్కుర్తిపడి కోట్లు దండుకున్నారని.... అలాంటి వారు లోకంలో ఎక్కడైనా ఉంటారా అని ఎద్దేవచేశారు. అదేవిధంగా ఆయన ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతూ పెద్దవడుగూరు మండలంలో జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకానికి సంబంధించి పెండింగ్లో ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు.

# గోవు మృతికి కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలి

విశాఖపట్నంజూలై 24, (న్యూస్ పల్స్)విశాఖలో వెలుగు చూసిన అమానుష ఘటనపై జనసేన నేతలుగ్గ్భాంతి వ్యక్తం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోకి గోవులు సంచరించడాన్ని అడ్డుకోవాలన్న నిర్ణయంతో భద్రతా సిబ్బంది వ్యవ హారించిన తీరుపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు.పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతుల ఆవులను బందించ డమే కాకుండా రైతుల పట్ల కర్కశంగా ప్రవర్తించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోవులను విడిచి పెట్టేందుకు డిడి రూపంలో డబ్బులు కూడా వసూలు చేశారని, అయితే గోవులను విడిచిపెట్టకుండా వాటి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవా లని కోరారు.అనంతరం మృతి చెందిన గోవుకి పలువురు నేతలు నివాళి అర్పించారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు జలమయం

ఒంగోలు జూలై 24, (న్యూస్ పల్స్)ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణ సమీపంలో పేరిట ఇళ్లు కట్టుకునేందుకు కేటాయించిన భూములన్నీ నీళ్లతో నిండిపోయాయి. చెరువుల్లా తలపిస్తున్నాయి. స్థలాలు మునిగిపోవడంతో మాజీ ఎమ్మెల్యే, కనిగిరి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, డాక్టర్ శ్రీ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అక్కడ వరినాట్లు వేసి నిరసన తెలిపారు. స్విమ్మింగ్ ఫూల్ ను తలపిస్తున్న జగనన్న ఇళ్ల కాలనీలో చిన్నారులు ఈత కొడుతున్నారు.

# నలభైమంది ఎమ్మెల్యేలకు జైలు ఖాయం

నందిగామ జూలై 24, (న్యూస్ పల్స్)జగన్మోహన్ రెడ్డి కి ధైర్యం ఉండి, ఇళ్ళ స్థలాల అవినీతిపై సీబీఐ విచారణ వేస్తే 40 మంది ఎమ్మెల్యేలు జైలుకు వెళ్లడం ఖాయమని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. నందిగామ అనాసాగరం లో ఇళ్ళ స్థలాల ముంపునుఅయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఇతరులు వున్నారు. దేవినేని మాట్లాడుతూ జే - ట్యాక్స్ వేల కోట్ల దోపిడీ కోసం పేదోళ్ళను మోసం చేశారు. లబ్ధిదారులకు రెండు వారాల్లో టిడ్కో ఇల్లు కేటాయించాలని.. లేదంటే ఆగస్టు 15న లబ్ధిదారులు గృహప్రవేశం చేస్తారు. నందిగామ అనాసాగరంలో ఎకరాకు రూ.11లక్షల అవినీతి జరిగిందని అయన అన్నారు.

# అప్పన్న ఆలయంలో ఆషాఢ పౌర్ణమి వేడుకలు

విశాఖపట్నం జూలై 24, (న్యూస్ పల్స్)సింహగిరిపై ఆషాఢ పౌర్ణమి వేడుక ఘనంగా జరిగింది. పండితులుఅప్పన్న స్వామి కి తుది విడతగా 125 కిలోల సుగంధ చందన సమర్పణ చేసారు. గురుపౌర్ణమి సందర్భంగా పెద్దసంఖ్యలో స్వామి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ దర్శన టికెట్ల విక్రయం జరిగింది. టికెట్ తీసుకున్న ఆఖరి భక్తుని వరకు దర్శనాలు కొనసాగించారు. శనివారం నాడు ఆలయంలో ఈరోజు ఆర్జిత సేవలు రద్దు చేసారు. ముందుగా టికెట్లు తీసుకుని భక్తులకు ఆదివారం దర్శనం చేసుకునే అవకాశం కల్పించారు.

# చెరకు రైతుల ఆందోళన

రేణిగుంట జూలై 24, (న్యూస్ పల్స్)చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాల, తమిళనాడు తిరువల్లూరు జిల్లా, చెరకు రైతులకు 50 కోట్లు చెల్లించ కుండా మోసం చేసిన మయూర షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం జయరాం చౌదరిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ చిత్తూరు జిల్లా రేణిగుంట హైవే రోడ్డుపై రైతు సంఘం నేతలునిరసన తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమలత, రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షులు మాంగాటి గోపాల్ రెడ్డి, ఆర్.పి.ఐ నాయకులు అంజయ్య, జనసేన నాయకులు రాజా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నారాయణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్, పాత చెక్ పోస్ట్ వరకు ర్యాలీగా వచ్చిన రైతులు అక్కడే రోడ్డుపై బైఠాయిం చడంతో గంటసేపు రోడ్డు దిగ్బంధం జరిగింది. దీంతో రేణిగుంట సీఐ అంజు యాదవ్, పోలీసులు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత ను, అఖిలపక్షం నేతలను, రైతు సంఘం నాయకులను అరెస్టు చేసి రేణిగుంట పోలీస్ స్టేషన్ కు తరలించా రు.ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమలత మాట్లాడు తూ గత రెండు సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలు చేసాము. అయినా ఎవరు పట్టించు కోలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈరోజు ఈ కార్యక్రమం చేయడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకొని సమస్య పరిష్కారం చేయాలని కోరారు.

# రహదారిపై గోతులు పూడ్చుతూ తెదేపా నేతల నిరసన



దెందులూరు జూలై 24, (న్యూస్ పల్స్): రహదారులు స్వచ్ఛందంగా మరమ్మతులు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. పెదవేగి మండలం బాపిరాజుగూడెంలో రహదారులపై ఉన్న గోతులను శనివారం తన అనుచరులతో కలిసి పూడ్చారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు తెదేపా నాయకులు ఏలూరు-చింతలపూడి రోడ్డులో బాపిరాజుగూడెం పరిధిలోని రామచంద్రాపురంలో గోతులు పూడ్చే చర్యలు చేపట్టారు. పోలీసులు అక్కడకు చేరుకొని గోతులు పూడ్చడానికి అనుమతులు లేవంటూ అడ్డుకున్నారు. అనంతరం అక్కడ నుంచి కొయ్యలగూడెంలో జరిగే ఆందోళన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ.. రహదారులపై గోతులు ప్రాణాంతకంగా మారాయన్నారు. ప్రజలు తమ ప్రాణాలు చేతబట్టి ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని, దానిని మేల్కొల్పేందుకే రహదారులపై గోతులు పూడ్చే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలలో బొప్పన సుధాకర్, మాగంటి నారాయణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జుజ్జూరులో తెదేపా నాయకుల అరెస్టు

కృష్ణా జిల్లా వీరులపాడు మండలంలోని అల్లూరు గ్రామంలో రహదారుల పరిస్థితిపై తెదేపా నాయకులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర్ రావు, విజయవాడ పార్లమెంటరీ తెదేపా ఇంఛార్జీ నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌమ్య, గద్దె రామ్మోహన్ రావు, తదితరులను అడ్డుకోవడానికి భారీగా వైకాపా కార్యకర్తలు తరలివచ్చారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి నందిగామ గ్రామీణ సీఐ నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు తెదేపా నాయకులను మండలంలోని జుజ్జూరు గ్రామంలో అరెస్టు చేశారు. ఈ మేరకు దేవినేని మాట్లాడుతూ.. రాష్ట్రంలో రహదారుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందన్నారు. వైకాపా నాయకులు దోచుకోవడం తప్ప అభివృద్ధి చేయలేకపోతున్నారంటూ ఎద్దేవా చేశారు. అరెస్టు చేసిన నాయకులను చందర్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు పార్టీలు వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు.

# వికలాంగులకు వాహనాలు పంపిణీ

తుంగతుర్తి జూలై 24, (న్యూస్ పల్స్)తన పుట్టిన రోజు నాడు తాను మాత్రమే సంతోషంగా ఉంటే సరిపోదని,పది మంది సంతోషంగా ఉండాలని కోరుకునే నాయకుడు కేటీఆర్ అని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. శనివారం కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజగవర్గం లోని అర్వపల్లి లో స్థానిక ఎమ్మెల్యే గాదరి కిషోర్ గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం లో భాగంగా 20 మంది వికలాంగులకు అందించిన ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను మంత్రి పంపిణీ చేశారు..ఇలాంటి కార్యక్రమానికి పిలుపునిచ్చినందుకు మంత్రి కేటీఆర్ కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.గత సంవత్సరం కేటీఆర్ పిలుపునందుకొని అనేక మంది ఏ విధంగా నైతే అంబులెన్సులను అందించారో,అలాగే ఈ సంవత్సరం కూడా అనేక మంది ట్రై సైకిళ్లను అందిస్తున్నారన్నారు.కార్యక్రమం సనంతరం రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ పిలుపు మేరకు నూతనకల్ మండలం బిక్కుమల్ల నుండి నకిరేకల్ వరకు జాతీయ రహదారి 365 పై 40 కిలోమీటర్ల పొడవు 60 వేల మొక్కలు నాటే కార్యక్రమానికి తుంగతుర్తి మండలం వెలుగుపల్లి వద్ద మొక్కను నాటి మంత్రి అంకురార్పణ చేశారు.

# విశాఖలో టీడీపీ నిరసన

విశాఖపట్నం రాష్ట్రం లో వైసీపీ ప్రభుత్వ పాలన కు వ్యతిరేకంగా విశాఖ లో ఆగ్రహ జ్వాలలు అలముకున్నాయి. గడిచిన రెండేళ్ళ పాలన లో కేవలం సంక్షేమం మాత్రమే చేస్తూ అభివృద్ధి ని తుంగలో తొక్కారని విమర్శిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో దక్షిణ నియోజకవర్గం, ఏడు గుడుల జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు నజీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్లు అద్వాన్నంగా వున్నాయని, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# పొంచి ఉన్న ప్రమాదం

### బిక్కుబిక్కుమంటున్న నిద్రి కాలనీవాసులు

కౌతాళం జూలై 24, (న్యూస్ పల్స్)మండల పరిధిలోని రౌడూరు గ్రామంలో నిద్రి కాలనిలో విద్యుత్ స్తంభాలు, ఏ క్షణ మైన పడటానికి సిద్ధంగా ఉన్నాయని ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. గత 20 సం విద్యుత్ స్తంభాలు పెచ్చులు ఊడిపోయి కింద పడటానికి సిద్ధంగా ఉంది ట్రాన్స్ఫార్మర్స్ మార్పు చేయాలని,విద్యుత్ స్తంభాలు కొత్తవి అమర్చలని ఎన్ని సార్లు విద్యుత్ అధికారులకు, గ్రామ నాయకుల విన్నవించు కొన్న ఫలితం లేకపోయింది వాపోతున్నారు. భారీ వర్షాలకు చుట్టూ ప్రక్కల విద్యుత్ ఆర్త్ వస్తుందని కాలనీవాసులు బయన్డోళనలు గురవుతున్నారు. గ్రామ, నాయకులు, విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏ క్షణ అయిన ప్రమాదం జరగవచ్చునని వెంటనే, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్స్ మార్చాలని కోరుతున్నారు.

# బలు గూడ గ్రామంలో మంచినీటి సౌకర్యం

విశాఖపట్నం జూలై 24, (న్యూస్ పల్స్)డుంబ్రిగుడ మండలంలోని పొత్తంగి పంచాయతీ బలు కూడా గ్రామంలో మంచినీటి సౌకర్యం కొరకు బోరు బావి ఏర్పాటు చేశారు పో తంగి సర్పంచ్ వెంకట్రావు వైస్ సర్పంచ్ జగ్గు నాయుడు ఆధ్వర్యంలో శనివారం బళ్ళు కూడా గ్రామములో బోరు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ వెంకట్రావు మాట్లాడుతూ గిరిజన గ్రామంలో మంచినీటి కల్పనా కు ప్రభుత్వము ప్రత్యేక చొరవ చూపిస్తుంది అన్నారు గిరిజన గ్రామాల్లో మంచినీటి సౌకర్యం లేక గిరిజనులు నానా అవస్థలు పడి ఉండేవారు పంచాయితీ నిధులతో మంచినీటి నివారణకు బోరు వేస్తున్న మనీ ఆయన అన్నారు పో తంగి పంచాయితీ లో బళ్ళు కూడా సంతా వలస గ్రామాల మొదటిసారిగా బోర్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# అరకు సంత భయాలు గ్రామంలో జి సి సి స్టాల్ ప్రారంభం

విశాఖపట్నం జూలై 24, (న్యూస్ పల్స్)డుంబ్రిగూడ సంత బాయలు గ్రామంలో శుక్రవారం జి సి సి బ్రాంచ్ మేనేజర్ డి సింహాచలం చేతుల మీదుగా ప్రారంభం చేశారు గిరిజనుల చే సేకరించబడిన అటవీ ఉత్పత్తులతో తయారుచేసిన సరుకులు జి సి సి ద్వారా నాణ్యమైన నిత్యవసర సరుకులు పసుపు కారము హలో వీర సబ్బు కుంకుడు కాయ సీకాయ షాంపూలు తేనె కాఫీ మిరియాలు నిత్యవసర సరుకులు బయట మార్కెట్ కంటే జి సి సి లో తక్కువ ధరలకు లభిస్తుందన్నారు ప్రతి సంతలో విక్రయాలు చేస్తామన్నారు అలాగే ఈ కార్యక్రమంలో జి సి సి సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి శూన్యం

### అడుగడుగునా అవినీతి పాలన

### టీడీపీ నాయకులు తిక్కారెడ్డి

మంత్రాలయం జూలై 24, (( విభారె) )మంత్రాలయం నియోజకవర్గం అభివృద్ధి శూన్యం అని, అడుగడుగునా అవినీతి పాలన సాగుతోందని, అమ్మ ఒడి నాన్న బుడ్డికి సరిపోతుందని తన సొంత లిక్కర్ తగలేక కర్ణాటక లిక్కర్ కు ఎగబడుతున్నారని మండలం లో అడుగడుగునా రోడ్లు అధ్వాన్నంగా ఉ న్న కనపడలేదని,రోజు రోజు పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, పెట్రోల్ వెంటనే తగ్గించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై మంత్రాలయం ఇన్ ఛార్జ్ తిక్క రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం జగన్ పాలన లో అడుగడుగునా అవినీతి సంత, రహదారి లో అడుగు కొక గుంత కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో నుంచి ర్యాలీ గా వెళ్లి బస్టాండు లో చెరువుల తలపిస్తున్న గుంతలో వరినారు అంటించి నిరసనలు వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గత రెండు సం అయిన ప్రజా పాలన అవినీతి రహితంగా మారిందని, రోజు రోజుకు పెరుగుతున్న లిక్కర్ దందాలు అడుగడుగునా నాయకుల దౌర్జన్యాలు, పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ హయాంలో వేల కోట్లు రహదారుల కు ఖర్చు పెట్టిన ఘనత ఒక్క టీడీపీకే ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఎప్పటికైనా స్పందించి రహదారుల కు మరమ్మతులు చేపట్టి ప్రజా పాలన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీనియర్ నాయకులు ఉలిగయ్య, చెన్న బసప్ప, వెంకటపతిరాజు,సుదీర్ రెడ్డి, సురేష్ నాయుడు, కొట్రేష్ గౌడ్, డాక్టర్ రాజానంద, విరేశ్, మంజు, రాహిమాన్,సల్మాన్ రాజ్, కార్యకర్తలు, అభిమానులు భారి సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో 2021-22 సంవత్సరానికి మొదటి విడతలో 627 మందికి మీడియా అక్రిడిటేషన్లు మంజూరు

### -జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి వీరపాండియన్

కర్నూలు, జూలై 24, (( విభారె) ) జిల్లాలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ లకు 2021-22 సంవత్సరానికి మొదటి విడతలో 627 మందికి మీడియా అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ జి.వీరపాండియన్ తెలిపారు.శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్క అక్రిడిటేషన్ దరఖాస్తును కూడా తిరస్కరించ లేదన్నారు. జి.ఓ.ఎం.ఎస్ నెంబర్ 142 లో ఉన్న అన్ని నిబంధనలను ఖచ్చితంగా పాటించి, అర్హత ఉన్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఇవ్వడానికి కమిటీ అంగీకారం తెలిపిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లాలో అర్హత ఉన్న 627 మంది జర్నలిస్టులకు మొదటి విడతలో అక్రిడిటేషన్ లు మంజూరు చేశామన్నారు. అక్రిడిటేషన్ మంజూరు కానివారు రాష్ట్ర సమాచార శాఖ వెబ్ సైట్ లో వెంటనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన డాక్యుమెంట్లను అప్లోడ్ చేసి, ఆ కాపీలను కర్నూలు ఉప సంచాలకులు, సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.. అనంతరం అప్లోడ్ చేసిన దరఖాస్తులను పరిశీలన చేసి తదుపరి సమావేశంలో అర్హత ఉన్న వారికి అక్రిడిటేషన్ మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటి సభ్యులు డీఎంహెచ్ ఓ డా.రామ గిడ్డయ్య, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె వెంకటేశ్వర్లు, హౌసింగ్ అసిస్టెంట్ మేనేజర్ నడ్డయ్య, సౌత్ సెంట్రల్ రైల్వే చిఫ్ కమర్షియల్ సూపర్వైజర్ శ్రీనివాసులు, ఏపీఎస్ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ శశిభూషణ్, అక్రిడిటేషన్ కమిటి కన్వీనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, ఉప సంచాలకులు కె.జయమ్మ, కన్వీనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, ఉప సంచాలకులు కె.జయమ్మ, ఐఅండ్ పిఆర్ డిఈ జయరావ్, తదితరులు పాల్గొన్నారు.

# వార్డు మహిళా పోలీసుల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన రూరల్ ఎస్పీ

గుంటూరు జూలై 24, (( విభారె) ) గుంటూరు జిల్లా పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయ మహిళా పోలీసులకు శాఖా పరమైన పరీక్షల ను నిర్వహించేందుకు గుంటూరులోని టీజేపీఎస్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని రూరల్ ఎస్పీ విశాల్ గున్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ గుంటూరు జిల్లా వ్యాప్తముగా ఉన్న 314 మంది వార్డు/గ్రామ సచివాలయ మహిళా పోలీస్ సిబ్బంది అందరికి పోలీస్ శాఖ యొక్క విధులు మరియు భాద్యతల గురించి,అదే విధముగా మహిళల, పిల్లల సంరక్షణ, భాద్యతల గురించి ఆన్ లైన్ శిక్షణ ఇచ్చామని అన్నారు. ఆ శిక్షణకు సంబంధించి పరీక్షలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. కోవిడ్ నిబంధనలకు అనుగుణముగా ఈ నెల 31వ తేదీన పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. పోలీస్ శాఖ విధులు, భాద్యతలకు సంబంధించి ఒక ప్రశ్న పత్రం, మహిళా, బాలల రక్షణకు సంబంధించి ఒక ప్రశ్న పత్రం మొత్తం మీద రెండు ప్రశ్న పత్రాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఒక్కో ప్రశ్న పత్రము గరిష్ఠంగా 100 మార్కులకు ఉంటుందని, ఒక్కో ప్రశ్న పత్రానికి 2 గంటల 30 నిముషాల సమయం ఇస్తామని అన్నారు. మొదటి పరీక్షా ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మరియు రెండవ పరీక్షా మధ్యాహ్నం 3 గంటల నుండి 5:30 గంటల వరకు ఉంటుంది. చేతి వ్రాత పూర్వకముగా జరిగే ఈ పరీక్షకు సచివాలయ మహిళ పోలీస్ సిబ్బంది పరీక్షా కేంద్రములోనికి నిర్దేశిత సమయములోపు చేరుకోవాలని,ప్రతి ఒక్కరు మాస్క్ తప్పని సరిగా ధరించడం, సానిటైజర్ ఉపయోగించడం, భౌతిక దూరం పాటించడం వంటి కోవిడ్ నిబంధనలు పాటించాలని అయన అన్నారు.

# శ్రీమఠంలో మృత్తిక సంగ్రహణ మహోత్సవం

### ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం

### బృందావనానికి ప్రత్యేక పూజలు

మంత్రాలయం జూలై 24, (( విభారె) కర్నూలు జిల్లా మంత్రాలయం పవిత్ర తుంగా తీరంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీగురు రాఘవేంద్రుల సన్నిధిలో మఠం పీఠాధిపతులు అధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా మృతిక సంగ్రహణ మహోత్సవం గురు పూజోత్సవంను పండితులు ఘనంగా నిర్వహించారు.ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ కి ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతి ఇచ్చారు.అనంతరం శ్రీశ్రీశ్రీ సుబుధీంధ్ర తీర్థులు తుంగభద్రా నది తీరాన ఉన్న తులసి వనము దగ్గరకు బంగారు పల్లకిలో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి తులసి వనం అంతర్భాగంలో అత్యంత పవిత్రమైన మృత్తికను స్వీకరించి ఊరేగింపుగా వచ్చి రాఘవేంద్ర స్వామి మూల బృందావనం పైన ఉంచి ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతులు నిర్వహించారు. అంతకుముందు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి నిర్మల్య అభిషేకం పంచామృత అభిషేకము స్వర్ణ కవచ సమర్పణ విశేష పుష్పాలంకరణ గావించారు. గురుపూజోత్సవమును పురస్కరించుకొని శ్రీ మఠంలో భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పవిత్ర తుంగా నదిలో స్నానం చేసి గ్రామదేవత మంచాలమ్మ రాఘవేంద్ర స్వామి మూల బృందావనంను దర్శించుకుని పునీతులయ్యారు

# పోలూరు గ్రామ సచివాలయము అకస్మిక తనిఖీ

### సచివాలయానికి వచ్చే సర్వీసులను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపించాలి

### సబ్ కలెక్టర్ చహత్ బాజ్ పాయ్

నంద్యాలజూలై 24, (( విభారె) )శనివారం ఉదయం నంద్యాల సబ్ కలెక్టర్ చహత్ బాజ్ పాయ్ నంద్యాల మండలంలోని పోలూరు గ్రామ సచివాలయం ను ఆకస్మిక తనిఖీ గావించారు. అనంతరం నంద్యాల సబ్ కలెక్టర్ చహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజల కు దగ్గరగా ఉ ంటూ మెరుగైన సేవలు అందించడంతో పాటు సచివాలయానికి వచ్చే సర్వీసులకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపించాలనిఅన్నారు.ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్ఎల్ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక, ప్రభుత్వ పథకాల పోస్టర్ లు తదితర వాటిని పరిశీలించారు. ఇప్పటివరకు సచివాలయానికి ఎన్ని సర్వీసులు వచ్చాయి, ఎన్ని సర్వీసులకు పరిష్కారం చూపించారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. నెట్ వర్క్ ఆసుపత్రుల జాబితాను పరిశీలించి ఎవరైనా రోగులు సచివాలయానికి వస్తే వారికి ఎక్కడ రెఫర్ చేస్తున్నారు... ఎవరితో మాట్లాడుతున్నారు... ఇప్పటివరకు ఎంతమందికి రేఫర్ చేశారు.. వంటి వివరాలను ఏఎన్ఎంను అడిగి రికార్డులను పరిశీలించారు.గ్రామపరధిలో ఎంతమందికి వ్యాక్సిన్ ఇచ్చారు... 45 సంవత్సరాల పైబడిన వారికి ఎంతమందికి వ్యాక్సిన్ వేశారు. ఫ్రెంట్ లైన్ వర్కర్లు ఎంతమంది ఉన్నారు... ఎంతమందికి వ్యాక్సిన్ ఇచ్చారు... ఇంకా రెండవ డోస్ ఎంతమంది వేయించుకోవాలి వంటి వివరాలను ఏఎన్ఎంను అడిగి రికార్డులను పరిశీలించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ, అందరిని మోటివేషన్ చేసి 100% వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఏ ఎన్ ఎంలకు ఆదేశించామనరు. నో మాస్క్- నో ఎంట్రీ బోర్డు పెద్ద బ్యానర్ ఏర్పాటు చేసి సచివాలయంకు వచ్చే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మాస్క్ ధరించాలని గ్రామాలలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు . వైయస్సార్ బీమా, కాపు నేస్తం, నేతన నేస్తం పథకాలకు సంబంధించి సోషల్ ఆడిట్ కంప్లీట్ చేశారా వంటి వివరాలు అడిగి నోటీస్ బోర్డ్ లో ప్రదర్శించాలని వెల్ఫేర్ అసిస్టెంట్ కు ఆదేశించారు . ప్రజలకు జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు . ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను ఇంటి వద్దనే అందించేందుకు సచివాలయ వ్యవస్థ అనేది చాలా కీలకమన్నారు. సచివాలయ ఉద్యోగులు అంతా సక్రమంగా విధులు నిర్వహించాలని, ఎవరు ఎక్కడికి వెళ్తున్నారు అనేది మూమెంట్ రిజిస్టర్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. రిజిస్టర్ లను జాగ్రత్తగా మెయింటెన్ చేయాలని, ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజల అందరికీ అవగాహన కల్పించాలన్నారు.

# మహానందిలో శాకాంబరీగా దర్శనమిచ్చిన కామేశ్వరీ అమ్మవారు:: ఈవో మల్లిఖార్జునప్రసాద్

మహానంది:: జూలై 24 ::(విభారె న్యూస్) ఆలయ ఈవో మల్లిఖార్జునప్రసాద్ ఆధ్వర్యంలో



ముందుగా తెల్లవారుఝామున అర్చక బృందం శువమారు వెయ్యి కేజీల వివిధ రకాల కూరగాయలతో అమ్మవారికి,అంతరాలయ మండపము,సింహ మండపములను అలంకరించిన విదవ శాఖములతో ఆలయప్రదక్షిణ చేసి కామేశ్వరీఅమ్మవారికి, శ్రీచక్రమునకు ప్రత్యేక ఉపచారాలు,సహస్రనామార్చనలు చేసి కదంబ నివేదనం,చేసి భక్తులకు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో ఈనాటి శాఖ దాతలైన లక్కనబోయిన వెంకట ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులు పాల్గొన్నారు.

# శిల్ప నగర్ సమస్యలపై మున్సిపల్ కార్యాలయం దగ్గర ధర్నా

### సీపీఐ కార్యదర్శి కె ప్రసాద్

నంద్యాల జూలై 24, (( విభారె) నంద్యాల పట్టణంలో శనివారం నాడు శిల్ప నగర్ లో సిసి రోడ్లు .డ్రైనేజీ. మంచినీటి సమస్య. వీధి దీపాల సమస్య. పరిష్కరించాలని సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో కాలనీ వాసులతో ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి డి శ్రీనివాసులు ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి సురేష్ సిపిఐ పట్టణ నాయకులు అజీస్ భాష సుబ్బరాయుడు పాల్గొన్నారు. సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో శిల్పా నగర్ లో మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాకు ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామినేని రాజు నాయుడు పార్టీ డివిజన్ నాయకులు మహేష్ దస్తగిరి మద్దతు తెలిపి పాల్గొనడం జరిగిందన్నారు. . అనంతరం నాయకులు మాట్లాడుతూ శిల్ప నగర్ ఏర్పడి 12 సంవత్సరములు అయిన కూడా ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు అని అన్నారు. అక్కడ సిసి రోడ్లు డ్రైనేజీలు మంచినీటి సమస్య వీధి దీపాల సమస్య పరిష్కారం అయ్యేంతవరకు సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో దశలవారీగా పోరాడుతూనే ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు మాధవ రెడ్డి నాగమల్లేశ్వర్ రెడ్డి శ్రీను గోపాల్ చిరంజీవి వెంకటేశ్వర్లు కాజా పుల్లయ్య సుబ్బమ్మ అన్వర్ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ హీరోయిన్ పెళ్లి మరింత స్పష్టత



బాలీవుడ్ హాట్ స్టార్ హీరోయిన్ కత్రీనా కైఫ్ పెళ్లికి రెడీ అయ్యిందంటూ గత కొన్ని వారాలుగా బాలీవుడ్ మీడియా వర్గాల్లో చర్చ జరుగుతోంది. జాతీయ మీడియాలో ఈ వార్తలు పెద్ద ఎత్తున వస్తున్నా కూడా ఇప్పటి వరకు ఆమె నుండి స్పష్టత రాలేదు. కాని తాజాగా ఆమె మేనేజర్ యాష్లె పెట్టిన పోస్ట్ తో అతి త్వరలోనే ఆమె పెళ్లి ఉంటుందని కన్ఫర్మ్ అయ్యింది. ఆమె పెళ్లికి ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా కూడా తాజాగా ఆయన షేర్ చేసిన ఫొటోతో క్లారిటీ వచ్చింది. యాష్లె పోస్ట్ తో ఆమె పెళ్లి గురించి ఇంతగా హడావుడి ఉండేది కాదు. కాని యాష్లె పోస్ట్ ను షేర్ చేసిన కత్రీనా థ్యాంక్యూ అంటూ స్పందించింది. అంటే ఆమె తన పెళ్లికి సంబంధించిన అధికారిక ప్రకటన చేసినట్లే కదా అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.పెళ్లి కూతురు కాస్ట్యూమ్స్ లో ఉన్న కత్రీనా ఫొటోను షేర్ చేసిన యాష్లె త్వరలోనే ఇది నిజం కావాలంటూ కోరుకుంటున్నట్లుగా కామెంట్ పెట్టడం.. అందుకు కత్రీనా స్పందించడం వంటి పరిణామాలు చూస్తుంటే అతి త్వరలోనే కత్రీనా పెళ్లికి సిద్దం అవ్వడం ఖాయంగా కనిపిస్తుంది. నాలుగు పదుల వయసు లోపే పెళ్లి చేసుకుంటాను అంటూ గతంలో ప్రకటించింది కత్రీనా. ఇటీవల ఆమె 39 ఏళ్ల వయసుకు అడుగు పెట్టింది. ఆమె తదుపరి బర్త్ డే కు ముందే పెళ్లి ఉంటుందని బాలీవుడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇక కత్రీనా ప్రేమ విషయానికి వస్తే గతంలో ఇద్దరు హీరోలతో ప్రేమ వ్యవహారం సాగించింది. కాని వారితో విడిపోయిన కత్రీనా కొన్నాళ్లు ఒంటరిలైఫ్ ను లీడ్ చేసింది. ప్రస్తుతం ఈమె యువ హీరో విక్కీ కౌశల్ తో ప్రేమలో ఉన్న విషయం తెల్సిందే.విక్కీ కౌశల్ తో ప్రేమాయణం గురించి చాలా రోజులుగా బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. వారు నిజమే అన్నట్లుగా అధికారికంగా ప్రకటించకుండా అనధికారికంగా వారి ప్రేమను నిజమే అంటూ చెప్పకనే చెప్పారు. ఇద్దరు కలిసి ప్రత్యేక వేడుకలకు హాజరు అవ్వడం.. డేటింగ్ లు పార్టీలు ఇద్దరు కలిసి తిరుగుతూ సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. వీరిద్దరి ప్రేమ వ్యవహారం పెళ్లి వరకు వస్తుందని అంతా అనుకున్నారు. అనుకున్నట్లుగానే వీరిద్దరు రాబోయే కొన్ని నెలల్లో పెళ్లి పీటలు ఎక్కడం దాదాపుగా ఖాయం అంటూ క్లారిటీ వచ్చేసింది.ఈ సమయంలో కొందరు అభిమానులు మాత్రం సాధ్యం అయినంత త్వరగా పెళ్లి చేసుకోవాలని.. మళ్లీ ఆలస్యం అయితే లవ్ బ్రేకప్ అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రేమలో ఎక్కువ కాలం ఉండటం వల్ల అపార్థాలు వస్తాయని.. తద్వార పెళ్లికి మరోకరిని చూసుకోవాల్సి వస్తుందని ఇంకొందరు కత్రీనా కు సూచిస్తున్నారు. విక్కీ కౌశల్ మరియు కత్రీనాలు ప్రస్తుతం బాలీవుడ్ లో మోస్ట్ బిజీ స్టార్స్. అలాంటి వీరిద్దరు జత కట్టి రియల్ లైఫ్ లో ఒక్కటి అయితే ఖచ్చితంగా ఒక అందమైన జంటగా వీరు నిలవడం ఖాయం.

# రెహమాన్ ఎవరో నాకు తెలియదు.. నేను పట్టించుకోను: బాలయ్య

టాలీవుడ్ సీనియర్ హీరోలలో ఒకరైన నందమూరి బాలకృష్ణ సినిమాలతోనే కాకుండా.. తన వ్యక్తిత్వంతో వ్యవహార శైలితో చర్చనీయాంశంగా మారుతుంటారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా తన వంతు సేవ చేసే బాలయ్య.. అదే సమయంలో ఫ్యాన్స్ ని లేదా తన అసిస్టెంట్స్ ని కొట్టి వార్తల్లో నిలుస్తుంటారు. మనసులో ఉన్నది ఉన్నట్టు మాట్లాడే బాలయ్య.. దీని కారణంగా అప్పుడప్పుడు ఇబ్బందులు కొని తెచ్చుకుంటూ ఉంటారు. ఇటీవల తాను నటించిన 'ఆదిత్య 369' చిత్రం 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బాలకృష్ణ పలు ఇంటర్వ్యూలు ఇచ్చారు.ఇంటర్వ్యూలో భాగంగా 'ఆదిత్య 369' లోని 'జాణవులే నెరజానవులే' పాట గురించి యాంకర్ ప్రస్తావించగా.. బాలకృష్ణ అందుకుని సంగీతం గురించి వివరించారు. "ఇళయరాజా గారి మ్యూజిక్ అద్భుతం. ప్రేక్షకుడిగా విమర్శకుడిగా ఒక విషయం చెబుతాను. మీరు గమనించారో లేదో. అది ఇళయరాజా గారి మ్యూజిక్ అంటే ఎవరూ నమ్మరు. ఒక్కో మ్యూజిక్ డైరెక్టర్ కి ఒక్కో స్టైల్ ఉంటుంది" అంటూ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ పేరు ప్రస్తావించారు బాలయ్య. వెంటనే రెహమాన్ ఎవరో నాకు తెలియదు అనడం గమనార్హం."రెహమాన్ ఎవరో నాకు తెలియదు. నేను పట్టించుకోను. పదేళ్లకు ఓ హిట్ ఇస్తాడు. ఆస్కార్ అవార్డ్.. అందుకే 'భారతరత్న' అంటే రామారావు చెప్పుతో సమానం.. కాలి గోటితో సమానం అన్నాను చివరికి. ఇచ్చినోళ్లకు గౌరవం కానీ.. ఆయనకు గౌరవం ఏంటి? పదవులకు ఆయన అలంకారం ఏమో కానీ.. ఆయనకు పదవులు ఎప్పుడూ అలంకారం కాదు అని అన్నాను. ఒక్కొక్కరికి ఒక స్టాంప్ ఉంటుంది. ఇది మణిశర్మ.. అది దేవిశ్రీప్రసాద్.. ఇది థమన్ అని చెప్పొచ్చు. కానీ 'ఆదిత్య 369' లో ఇళయరాజా సంగీత పోకడ ఎక్కడా కనిపించదు" అని బాలకృష్ణ చెప్పుకొచ్చారు.అయితే బాలయ్య చెప్పిన మాటలు ఒకదానికొకటి సంబంధం లేకుండా ఎవరికీ అంతుపట్టకుండా ఉన్నాయి. ఇళయరాజా గురించి మాట్లాడుతూ మధ్యలోకి రెహమాన్ ని ఎందుకు తీసుకొచ్చారో.. మళ్ళీ ఆయన ఎవరో తెలియదని కామెంట్స్ ఎందుకు చేశారో.. ఈ క్రమంలో రామారావుని గుర్తు చేసుకొని 'భారతరత్న' ఆయన చెప్పుతో కాలి గోటితో సమానమని ఎందుకు అన్నారో అర్థం కావడం లేదని నెటిజన్స్ అంటున్నారు.



# మీరాబాయ్ చాను.. కట్టెలు మోసిన చేతులే సిల్వర్ మెడల్ తీసుకొచ్చాయి



టోక్యో: ఆమెకు బరువులు మోయడం కొత్త కాదు. ఒకప్పుడు కుటుంబం కడుపు నింపడానికి కట్టెలు మోసింది. ఇప్పుడు 140 కోట్ల ప్రజల ఆశల భారాన్ని మోస్తూ ఒలింపిక్స్ వెయిట్‌లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్ తీసుకొచ్చింది. ఆమె పేరు మీరాబాయ్ చాను (ఇది ఆమె సక్సెస్ స్టోరీ.కుటుంబంలో చిన్నదైనా..ఆమెది ఈశాన్య భారతం. మణిపూర్ కొండకోనల్లో పుట్టి పెరిగింది. ఆరుగురు సంతానంలో అందరి కంటే చిన్నది. కానీ కుటుంబ బరువు బాధ్యతలు మోయడంలో మాత్రం పెద్దదే. ఇంఫాల్‌కు 20 కిలోమీటర్ల దూరంలోని నాంగ్‌పాక్ కాక్‌చింగ్ అనే ఊళ్లో ఓ నిరుపేద కుటుంబంలో పుట్టింది సైఖోమ్ మీరాబాయ్ చాను. కొండకోనల్లో కట్టెలు కొట్టుకొచ్చి కడుపు నింపుకోవడమే ఆ కుటుంబానికి తెలిసింది. అందరి కంటే చిన్నదైనా కూడా మొదటి నుంచీ బరువులు మోయడంలో మీరాబాయ్ దిట్ట. 12 ఏళ్ల వయసులోనే తన కంటే పెద్దవాళ్లయిన తోబుట్టువులు కూడా మోయలేని బరువును తలపై ఎత్తుకొని 2 కిలోమీటర్లు అవలీలగా నడిచేసింది. సరిగ్గా 8 ఏళ్ల ఆ తర్వాత ఆ అమ్మాయే 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో సిల్వర్ మెడల్ గెలిచింది.ఐదేళ్ల వయసు నుంచే..మీరాబాయ్ ఐదేళ్ల వయసులోనే తలపై ఓ నీటి బకెట్‌ను పెట్టుకొని కొండను కూడా సునాయాసంగా ఎక్కడం నేర్చుకుంది. అప్పుడది కుటుంబ అవసరం. కానీ అవసరమే తన కెరీర్‌గా మారుతుందని ఆమె ఎప్పుడూ ఊహించలేదు. అలా నీటి బకెట్లతోపాటు కట్టెలు మోయడం క్రమంగా మీరాబాయ్‌ను రాటుదేల్చింది. 14 ఏళ్ల వయసు వచ్చేసరికి ఆమె వెయిట్‌లిఫ్టింగ్ వైపు చూసింది. తనను ఆ దిశగా ఇన్‌స్పైర్ చేసింది ఏడుసార్లు వరల్డ్ చాంపియన్‌షిప్స్ సిల్వర్ మెడలిస్ట్ కుంజరాణి దేవి. ఆమెను చూసిన తర్వాతే ఇక బరువులు మోయడాన్ని తన కెరీర్‌గా మలచుకోవాలని మీరాబాయ్ నిర్ణయించుకుంది.వెదురు బొంగులకు బరువులు తగిలించుకొని..చిన్నతనం నుంచీ కుటుంబం కోసం ఎంత కష్టపడిందో.. వెయిట్‌లిఫ్టింగ్ శిక్షణ కోసం కూడా ఆమె అంతగానే చెమటోడ్చింది. తన ఊరికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్రైనింగ్ సెంటర్‌కు రోజూ వెళ్లి వచ్చేది. మొదట కోచ్ అనితా చాను ఆమెకు శిక్షణ ఇచ్చింది. అక్కడ మీరాబాయ్ మొదట వెదురు బొంగులనే బార్‌బెల్స్‌గా ఉపయోగించి బరువులు మోసింది. అలా తన టెక్నిక్‌ను మెరుగుపరచుకున్న ఆరు నెలల తర్వాత సాంప్రదాయ వెయిట్‌లిఫ్టింగ్ టూల్స్ వైపు మళ్లింది.అలా రెండేళ్లలోనే సబ్‌జూనియర్ స్టేట్ లెవల్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల గెలిచే స్థాయికి చేరింది. 2011లో జూనియర్ కేటగిరీలో తొలిసారి నేషనల్ మెడల్ గెలిచింది. అదే కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ మెడల్ తనను తన ఆరాధ్య వెయిట్‌లిఫ్టర్ కుంజరాణిదేవి దగ్గరికి తీసుకెళ్లింది. అలా 2014లో కామన్వెల్త్ గేమ్స్ రూపంలో తొలిసారి అంతర్జాతీయ వేదికపై సత్తా చూపే అవకాశం దక్కింది. తొలిసారే 48 కేజీల విభాగంలో సిల్వర్‌తో మెరిసింది.2014లో ఏషియన్ గేమ్స్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగినా ఉత్త చేతులతోనే తిరిగి వచ్చింది. కానీ 2016 రియో ఒలింపిక్స్‌కు మాత్రమే అర్హత సాధించగలిగింది. కానీ అక్కడ తీవ్ర నిరాశ ఎదురైంది. క్లీన్ అండ్ జెర్క్‌లో ఒక్కసారి కూడా బరువు ఎత్తలేక నిరాశతో వెనుదిరిగింది. ఈ ఊహించని పరిణామంతో తీవ్రంగా కలత చెందిన ఆమె.. గేమ్‌ను వదిలేయాలని భావించింది. కానీ కొంతకాలం తర్వాత ఆ బాధ నుంచి బయట పడిన మీరాబాయ్.. బలంగా పుంజుకుంది.ఏడాది తర్వాత జరిగిన వరల్డ్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఏకంగా గోల్డ్ మెడల్ గెలిచింది. కరణం మల్లీశ్వరి తర్వాత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో గోల్డ్ గెలిచిన రెండో ఇండియన్ వెయిట్‌లిఫ్టర్‌గా చరిత్ర సృష్టించింది. ఆ తర్వాతే ఆమెకు అత్యున్నత పౌరపురస్కారం రాజీవ్ ఖేల్‌రత్న దక్కింది. 2018లో పద్మశ్రీ అవార్డుతో ప్రభుత్వం సత్కరించింది. ఇప్పుడు ఎన్నో ఆశలతో టోక్యో ఒలింపిక్స్‌లో అడుగుపెట్టిన మీరాబాయ్.. ఏకంగా సిల్వర్ మెడల్‌తో చరిత్ర సృష్టించింది.

# మిషన్ కోసం మారువేషంలో 'రాజా విక్రమార్క'

'ఖిలీ 100' ఫేమ్ కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ హై ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్టైనర్ "రాజా విక్రమార్క". శ్రీ సరిపల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఎన్ఐఏ ఆఫీసర్ గా కార్తికేయ కనిపించనున్నాడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు - కాన్సెప్ట్ వీడియో - ఫస్ట్ లుక్ మంచి స్పందన తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో నేడు బక్రీద్ పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని 'రాజా విక్రమార్క' నుండి ఆసక్తికరమైన పోస్టర్ ని చిత్ర యూనిట్ విడుదల చేసింది.ఇందులో కార్తికేయ ముస్లిం యువకుడిగా తలకు తెల్లటి క్యాప్ ధరించి ఇంటెన్స్ లుక్ లో కనిపిస్తున్నాడు. ఔఎం అధికారి అయిన హీరో.. ఏదో మిషన్ కోసం ఇలా మారువేషం వేసుకున్నట్లు అర్థం అవుతోంది. ఈ పాత్ర కోసం కార్తికేయ భారీ వర్కవుట్స్ చేసి సిక్స్ ప్యాక్ బాడీని రెడీ చేశాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**